# జాతీయ స్ఫూర్తి

పక్షపత్రిక

2019, సెప్టెంబరు 16-30 వెల : రూ.15/-

పుట్టుకే కాదు బతుకులోనూ నిష్ఠాపరుడు రాఘవాచారి

సంక్షోభం దిశగా భారత ఆర్థిక వ్యవస్థ

హిందూ మెజారిటీవాదం వ్యాప్తి కోసమే ఎన్.ఆర్.సి.

సామాజిక న్యాయానికి తపించిన అంబేద్కర్

వేతనశర్మ కథ

బూర్జువా సమాజంలో డబ్బుకు ఉండే శక్తి

ప్రపంచానికి మార్క్స్ ఇచ్చిన బహుమతులు

18

డి.వి.వి.యస్. వర్మ
ప్రధాన సంపాదకులు
సెల్ : 98660 74023

డా॥ బి. రమేష్‌చంద్రబాబు
సంపాదకులు
సెల్ : 93971 14495

# జాతీయ స్ఫూర్తి
పక్షపత్రిక

2019 సెప్టెంబర్ 16-30
సంపుటి : 27   సంచిక : 18
వెల : 15/- రూపాయలు

నిడదవోలు వెంకటేశ్వరరావు
సంపాదకులు


## ఈ సంచికలో...


4 పుట్టుకే కాదు బతుకులోనూ నిష్ఠాపరుడు రాఘవాచారి - ఆర్వీ రామారావు
6 సంక్షోభం దిశగా భారత ఆర్థిక వ్యవస్థ - ప్రొ॥ బి.రామకృష్ణారావు
8 మోదీ పూసిన మలాము - మాడభూషి శ్రీధర్
9 బిజెపి ఆధిపత్య రాజకీయం - యోగేంద్ర యాదవ్
11 హిందూ మెజారిటీవాదం వ్యాప్తి కోసమే ఎన్.ఆర్.సి. - డి. సోమసుందర్
14 సామాజిక న్యాయానికి తపించిన అంబేద్కర్ - డా॥ పట్టా వెంకటేశ్వర్లు
16 మన తరం తుగ్లక్ కథలు మనమే రాసుకోవాలి - మందలపర్తి కిషోర్
17 వేతనశర్మ కథ - రావిశాస్త్రి
21 బూర్జువా సమాజంలో డబ్బుకు ఉండే శక్తి - కార్ల్‌మార్క్స్
25 ప్రపంచానికి మార్క్స్ ఇచ్చిన బహుమతులు - అవిజిత్ పాఠక్
28 కార్ల్‌మార్క్స్ చేసిన ఐదు పనులు



## చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి | రూ. 15-00 |
| చందా వివరాలు : | |
| 2 సంవత్సరాలకు | రూ. 500-00 |
| 1 సంవత్సరానికి | రూ. 300-00 |
| విద్యార్థులకు | రూ. 150-00 |

*చందా డి.డి. లేదా మనియార్డరు ద్వారానే పంపండి. చెక్కులు పంపరాదు*

Bank A/c No.3620 101 0000 380
Syndicate Bank, Eluru Main Branch
IFSC Code : SYNB0003620

పంపవలసిన చిరునామా :

**డా॥ బి. రమేష్‌చంద్రబాబు**
క్రాంతి నర్సింగ్ హోమ్
నన్నయ్య విగ్రహం వద్ద, మెయిన్‌రోడ్
తణుకు - 534 211
✆ 08819 222265, 93971 14495


**హస్తం గూటికి బి.ఎస్.పి. ఎమ్ఎల్ఏలు** - రాజస్థాన్

ఏ పార్టీ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం
అధికార పార్టీల ఆకర్షణల పరాయణత్వం

**పటేల్ స్ఫూర్తితోనే 370 రద్దు** - ప్రధాని మోదీ

ఇదెక్కడి చరిత్ర అంటే నా చరిత్ర నా యిష్టం

**విద్యార్థులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతాం** - ప్రైవేటు యాజమాన్యాలు

భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం పాతబడిపోయింది.

**ఒకే దేశం - ఒకే భాష** - అమిత్ షా

రాజభాష పేరుతో రాష్ట్రాల విలీనం

## ఈ పక్షం చాట్ మసాలా

**నా ఫోటోలు మీ వద్ద వుంటే పంపండి** - ప్రధాని విజ్ఞప్తి

మీరు వేలం వెయ్యకండి - నేనే వేస్తాను

**2024లో తెలంగాణాలో కాషాయ జెండా ఎగురుతుంది** - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

జెండా పండుగ మీ ఇష్టం - ఓట్ల పండుగ ప్రజాభీష్టం

**మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో టి.ఆర్.ఎస్. పోటీ**

కారులో కేసిఆర్ షికారు

**రోడ్లు బాగుంటే ప్రమాదాలు** - కేంద్రమంత్రి సదానంద గౌడ

ఇకపై గుంతల రోడ్లే ప్రాప్తం

# ఆర్థిక మాంద్యం - కార్పొరేట్ నైవేద్యం

సంపాదకీయం

దేశాన్ని ఆర్థిక మాంద్యం చుట్టుముట్టింది. కేంద్రప్రభుత్వం కార్పొరేట్ నైవేద్యాన్ని ప్రారంభించింది. కార్పొరేట్లకు రాయితీలు ఇవ్వడమే అభివృద్ధికి తారకమంత్రంగా భావిస్తున్నది.

ఈ సంవత్సరం బడ్జెట్‌లో స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)ని 3 ట్రిలియన్ డాలర్ల నుండి త్వరలో 5 ట్రిలియన్ డాలర్లకు వృద్ధి చెయ్యడం లక్ష్యంగా ప్రకటించారు.

ఈ బడ్జెట్ తమ ప్రభుత్వ విధానాలకు ఒక ట్రైలర్ మాత్రమేనని ఆనాడే ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఇటీవల తన 100 రోజుల పాలన మీద కూడా ఇదే వ్యాఖ్యను మరోసారి వినిపించారు. మూడు నెలలలోనే అసలు సినిమా దృశ్యాలు తెర మీద కనిపిస్తున్నాయి. ఇప్పుడు జిడిపి వృద్ధి రేటు అత్యంత కనిష్ట స్థాయికి దిగజారి 5 శాతంగా వుంది. వాస్తవానికి అది 4 శాతం లోపేనని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పెద్ద నోట్ల రద్దుతో చిన్నాచితక పరిశ్రమలు మూతపడ్డాయి. అసంఘటిత రంగం కుదేలయింది. లక్షల మందికి ఉద్యోగాలు, ఉపాధి గల్లంతు అయ్యాయి. ఆ తర్వాత జి.యస్.టి. దెబ్బతో వ్యాపారరంగం మందగించింది. ఇప్పుడు ఆర్థికమాంద్యం పూర్తిగా కొంప ముంచింది. కొన్ని పరిశ్రమలు మూతకొచ్చాయి. ఎన్నో పరిశ్రమలు ఉత్పత్తిని కుదించి ఆ మేరకు ఉపాధిని కలిగిస్తున్నాయి. మొత్తం మీద లక్షల ఉద్యోగాలు ఊడిపోతున్నాయి.

కార్పొరేట్ రంగానికి ఉద్దీపనల వల్ల ఆర్థిక పరిస్థితి చక్కబడదని రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్లు రఘురాంరంజన్, దువ్వూరి సుబ్బారావులు స్పష్టం చేస్తున్నారు. అనేక మంది ఆర్థిక నిపుణులు దీనిని తప్పుపడుతున్నారు.

సర్జికల్ స్ట్రైక్స్‌కు పేరు పొందిన సర్కారు ఒకేసారి 1.45 లక్షల కోట్ల ఉద్దీపనలను కార్పొరేట్ రంగానికి ప్రసాదించింది. స్టాక్ మార్కెట్ల తక్షణ ఉత్సాహాన్ని చూసి సంబరపడుతున్నది. ఈ నీటి బుడగ బతుకు మాత్రం తాత్కాలికమే.

మన దేశంలో ఆదాయ అంతరాలు తీవ్ర రూపంలో వున్నాయి. పేదరికాన్ని అది ప్రత్యక్షం చేస్తున్నది. ప్రజల కొనుగోలు శక్తి నానాటికీ క్షీణిస్తున్నది. నిరుద్యోగం రేటు గరిష్ట స్థాయికి చేరింది. మరో పక్క ప్రభుత్వం సంపద పునఃపంపిణీకి చర్యలు తీసుకోవడానికి బదులు దానికి ఊతం ఇస్తున్నది. ప్రభుత్వ పెట్టుబడులు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో పెంచడానికి బదులు కోతలు విధిస్తున్నది.

కార్పొరేట్ రంగం చుట్టూ తిరిగే ప్రభుత్వానికి ఇది చెవికెక్కుతుందా ? ❑

# పుట్టుకే కాదు బతుకులోనూ నిష్ఠాపరుడు రాఘవాచారి



ఆర్వీ రామారావు



గోయెంకా సంస్థానం నుంచి వెలువడే ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రప్రభ మొదలైన పత్రికలన్నింటికీ దక్షిణాదిలో ప్రధాన కార్యనిర్వహణాధికారిగా ఉన్న కె.సి. వెంకట కృష్ణన్‌తో ఏదో సందర్భంలో మాట్లాడుతున్నప్పుడు తెలుగులో ఉత్తమ సంపాదకులు ఎవరు అని అడిగారు. నేను తడుముకోకుండా నండూరి రామమోహనరావు అన్నాను. 'కాదు రాఘవాచారి' అన్నారు ఆయన. నేను రాఘవాచారి పేరు చెప్పక పోవడానికి కారణాలేమైనా కావచ్చు. నా మనసులో ఉన్న మాట అదే అయినా కె.సి. వెంకట కృష్ణన్ ఎవరో తెలుసు కనక ఆయన మెప్పితం కోసమే కావచ్చు నండూరి పేరెత్తాను. 'రాఘవాచారి కనక మా సంస్థలో చేరేటట్టయితే ఆయన ఎంత అడిగితే అంత ఇస్తాం' అన్నారు వెంకటకృష్ణన్. పెట్టుబడి, లాభాలే ప్రధానమైన పత్రికా వ్యవస్థలో ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తికి రాఘవాచారి మీద అపారమైన గౌరవం ఉండడం ఆశ్చర్యం కలిగించింది.

రాఘవాచారి నాకు నాలుగు దశాబ్దాలపై నుంచే తెలుసు. కొంత కాలం నేను విజయవాడలో పని చేయడం వల్ల తరచుగా కలుసుకునే అవకాశం వచ్చింది. నేనూ ఆంధ్రభూమిలో సంపాదకీయాలు రాస్తూ ఉండేవాడిని కనక ఏ అనుమానం వచ్చినా రాఘవాచారినే సంప్రదించేవాణ్ని. పత్రిక రచనకు సంబంధించినంత మేరకు నేను సంప్రదించే మరో వ్యక్తి జి.ఎస్. వరదాచారి. వీళ్ళిద్దరి మధ్య ఒక తేడా ఉంది. సైద్ధాంతికంగా రాఘవాచారి నేను ఒకే కుదురుకు చెందినవాళ్లం. వరదాచారి పూర్తిగా భిన్నమైన భావజాలం గలవారు. కానీ ఇద్దరూ ఆత్మీయులే.

1995 జూన్ ఆరో తేదీన ఆచార్య ఎన్.జి.రంగా మరణించినప్పుడు సంపాదకీయం రాయాల్సి వచ్చింది. షరా మామూలుగా రాఘవాచారితో మాట్లాడాను. బోలెడు విషయాలు చెప్పారు. ఆయనా విశాలాంధ్రలో సంపాదకీయం రాశారు. ఆ రోజు ఫోన్ చేసి "నా సంపాదకీయం కన్నా నీదే బాగుందయ్యా" అన్నారు. రాఘవాచారి సౌశీల్యం స్థాయి అది. ఎప్పుడు కలిసినా ఉమ్మడిగా పరిచయం ఉన్న వారందరి గురించీ వాకబు చేయడం ఆయనకు అలవాటు. అది మనుషులను ప్రేమించే మనిషి తత్వం. ఎప్పుడు ఆయనను సందేహం అడిగినా ఫలానా పత్రికలో ఫలానా పేజీలో ఇన్నో కాలంలో ఉంది చూడు అనేవారు. ఆయన జ్ఞాపక శక్తి చూస్తే ఆశ్చర్యచకితం కావడం తప్ప చేసేది ఏమీ ఉండదు.

విజయవాడ రోడ్ల మీంచి వెళ్తున్నప్పుడు 'అభ్యాస విద్యాలయం' అన్న బోర్డు కనిపించింది. పేరు భలే ఉందే అనుకున్నాను. రకరకాల సంస్థలు నెలకొల్పే వారు మంచి పేరు కోసం రాఘవాచారిని అడిగేవారు. ఇదీ ఆయనే పెట్టారనుకున్నా. ఆయననే అడిగితే అవును అని

"శైశవేఽభ్యస్తవిద్యానాం
యౌవనే విషయైషిణాం
వార్ధకే మునివృత్తీనాం
యోగేనాంతే తనుత్యజామ్" మొత్తం శ్లోకం చదివేవారు. అదీ ఆయన జ్ఞాపక శక్తి. ఆ పాఠశాల ఏర్పాటు చేసింది దీపా స్మారక ట్రస్టు. దానికి రాఘవాచారి, ఆయన అర్ధాంగి కనపర్తి జ్యోత్స్న ట్రస్టీలు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి దాకా వరుసగా ముఖ్యమంత్రులందరి పేర్లు తడుముకోకుండా చెప్పే వాళ్ళు ఇప్పటికీ కొంత మందైనా ఉండవచ్చు. కానీ వారు ఏ రోజున పదవి చేపట్టాడు, ఏ రోజున పదవీ విరమణ చేశారు, దానికి ప్రధాన కారణం ఏమిటి అని గుక్క తిప్పుకోకుండా చెప్పగల ఏకైక వ్యక్తి రాఘవాచారి. అదీ ఆయన ధీశక్తి.

ఒకరోజు హైదరాబాద్‌లోని విశాలాంధ్ర ఆఫీసుకు వెళ్లే సరికి రాఘవాచారి ప్రముఖ దినపత్రికలో సంపాదకీయ పేజీలోని వ్యాసం చదువుతున్నారు. నన్ను చూడగానే రాజ్యాంగంలోని ఫలానా అధికరణం ఏం చెప్తోంది అని అడిగారు. నాకు గుర్తున్నదేదో చెప్పా. నువ్వు లా చదవలేదుగా అన్నారు. లేదు అన్నాను. ఈ వ్యాసరచయిత లా చదివాడుగా, మరి తప్పెందుకు

రాశాడు అన్నారు. దానికి నా దగ్గర సమాధానం లేదు కాని రాజ్యాంగాన్ని అధ్యయనం చేయడం పత్రికా రచయితలకు తప్పనిసరి అన్న నా విశ్వాసం మరింత బలపడింది. రాఘవాచారితో అంత సన్నిహిత పరిచయం లేనప్పుడే విశాలాంధ్రలో దాదాపు దశాబ్దం పని చేసిన ఓ మిత్రుడు, సీనియర్ పత్రికా రచయితలు ఎం. రాజేంద్ర, ఆర్. శ్రీనివాసన్ తరచుగా ఆయన గురించి ప్రస్తావిస్తూ ఉండేవారు. రెండు ప్రసిద్ధ ఇంగ్లీషు పత్రిక విలేకరులు రాఘవాచారి చెప్తూ ఉంటే రాసుకుని పంపించే వారు అని నానుడి. సంపాదకుడైనా మిగతా సిబ్బందితో కలిసి ఆయన విశాలాంధ్ర ఆవరణలో బ్యాడ్మింటన్ ఆడేవారట. అదీ ఆయన కలివిడితనం. ఆయన సంపాదకీయాల గురించి ఎవరైనా చెప్పొచ్చు. నాకు మాత్రం ఓ ఫిర్యాదు ఉంది. ఆయన విశాలాంధ్రలో పని చేస్తున్నప్పుడు కూడా రాసిన వ్యాసాలు తక్కువే. రాసినప్పుడు మాత్రం భిన్నమైన శైలి ప్రస్ఫుటంగా కనిపించేది. సారాన్ని బట్టి రూపం అన్న సూత్రం ఒంట బట్టించుకోవడం అంటే ఇదే.

రాఘవాచారి అపారమైన గిరాకీ ఉన్న వక్త. ఏ విషయం గురించైనా అనర్గళంగానే కాదు సందర్భానుసారంగా, సమయస్ఫూర్తితో, సాఫల్యంగా మాట్లాడతారు. విజయవాడలో ఆయన ఎప్పుడూ సభలూ, సమావేశాలతో తీరిక లేకుండా ఉండేవారు. ఒకసారి గుంటూరులో త్యాగరాయ ఆరాధనోత్సవాలు చేస్తున్నాం. మీరు రావాలి అని నన్ను ఆహ్వానించడానికి ఇద్దరు ముగ్గురు వచ్చారు. వాళ్లను చూస్తే సంగీతం బాగా తెలిసిన వాళ్లలా కనిపించారు. సంగీతం, అందునా శాస్త్రీయ సంగీతం బొత్తిగా తెలియని అజ్ఞాన ఖనిని నేను. "నేనెందుకు రాఘవాచారిని పిలవండి" అని అడక్కుండానే ఉచిత సలహా పడేశా. "లేదండీ, ఆయనే మీ పేరు సూచించారు. పోయిన ఏడాది ఆయననే ఆహ్వానించాం. మీరు రాక తప్పదు" అన్నారు. నాకు దిక్కు తోచలేదు. నాకు త్యాగరాజ స్వామి గురించి తెలుసు సంగీతం ఏ మాత్రం తెలియదు. తప్పనందువల్ల వెళ్లా. సంగీతం గురించి ఒక్క మాట మాట్లాడకుండా ఆయన సంగీతం అంత ప్రచారంలోకి రావడానికి ఆయన జీవించిన కాలం నాటి సామాజిక పరిస్థితుల గురించి ఆయన కీర్తనలనే ఉటంకించి మాట్లాడి ఓ పని అయిపోయిందనిపించా. 'మీకు సంగీతం తెలియదంటారేమిటి' అని వాళ్లు ఎదురు ప్రశ్నించారు. రాఘవాచారికి అనేకానేక విషయాలు తెలుసు. తెలుసుకోవాలన్న సత్యాన్ని మాత్రం ఆయన నుంచే నేర్చుకున్నా. ఆయనే నాకు పరోక్ష బోధకుడు.

తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, ఉర్దూ భాషలు ఆయనకు తెలుసు అనడం అర్ధ సత్యం. ఆ భాషలన్నింటిలో ఆయనకు పాండిత్యం ఉంది అనడం అక్షర సత్యం. అయితే మిగతా భాషలన్నింటిలో కన్నా ఆయనకు ఇంగ్లీషు ఎక్కువ వచ్చుననిపిస్తుంది. మంచి తెలుగు రాస్తారు. కానీ కొన్నిసార్లు ఆ వాక్య నిర్మాణంలో ఇంగ్లీషు ప్రభావం అనివార్యంగా కనిపిస్తుంది. "ఇది వక్కాణింపులకు అర్థం" లాంటి ఆయన ప్రయోగాలు చూసినప్పుడు మనస్సు చివుక్కుమనేది. చనువు ఉంది కనక కొన్ని సార్లు ఆయనతోనే ఈ మాట చెప్పాను. "ఆ విషయంలో నన్ను వదిలేయ్" అంటారు. రూప వైశిష్ట్యం కన్నా ఆయనకు విషయ స్పష్టతే ప్రధానం అనిపిస్తుంది.

చదివిన చదువును బట్టి ఆయన న్యాయశాస్త్రంలో స్నాతకోత్తర పట్టా పుచ్చుకున్నవారు కనక ఆ రంగంలో రాణించే వారే. ఆయన చేతిలో ఉన్నది కేవలం పట్టా కాదు. కూలంకషమైన జ్ఞానం. అయితే ఆయన ఆ వృత్తి చేపట్టడానికి అవకాశం రాలేదు. ఆయనకు ఈడొచ్చే వయసులో తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం తీవ్రంగా ఉండి ఆయన స్వగ్రామమైన వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం లోని తాతాపురంలో కమ్యూనిస్టులు ఆశ్రయం పొందేవారు. రాఘవాచారి అమ్మగారు ఆ కమ్యూనిస్టు నాయకులకు భోజనం పెట్టేవారు. కాని అది తమ కుటుంబ సభ్యులతో కలిసి కాకుండా విడిగా పెట్టేవారు. రాఘవాచారి పుట్టింది శుద్ధ శ్రోత్రీయ బ్రాహ్మణ కుటుంబంలో. అందుకని ఇతర కులాల వారికి భోజనం పెట్టే ఔదార్యం వారి ఇంట్లో వారికి ఉన్నా, అది విడిగా వడ్డించడానికే పరిమితం. కనక ఆయనలో ఈ వ్యత్యాసాల మీద ఆలోచన మొదలైంది. వాళ్ల అన్నయ్య విశాలాంధ్ర పత్రిక తీసుకొచ్చేవారు. అది రాఘవాచారి చదివేవారు. తద్వారా ఆయన భావజాలం రూపు దిద్దుకుంది. చదువు పూర్తి అయిపోయిన తరవాత కమ్యూనిస్టు పార్టీ విశాలాంధ్ర విలేకరిగా పని చేయమంటే ఆయన పత్రికా రచన వృత్తిలోకి వచ్చారు. ఆ తరవాత ఢిల్లీ నుండి వెలువడే పేట్రియాట్ దినపత్రిక, తిలక్ వారపత్రికకు హైదరాబాద్ విలేకరిగా పని చేశారు. కొద్ది కాలం ఢిల్లీలో కూడా పని చేసినట్టున్నారు. ఆ తరవాత కమ్యూనిస్టు పార్టీ ఆయనను విశాలాంధ్ర సంపాదకుడిగా నియమించింది. ఆ బాధ్యతలు 28 ఏళ్ల సుదీర్ఘకాలం పాటు నెరవేర్చారు. పత్రికా

☞ **మిగతా 20వ పేజీలో**

# సంక్షోభం దిశగా భారత ఆర్థిక వ్యవస్థ

ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు
విశ్రాంత ఆచార్యులు, ఆంధ్రా యూనివర్సిటీ

నేడు భారత ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకుందా? లేక మాంద్యం అంచుల్లో ఉందా? ఇదే నేడు చాలామందిలో చర్చనీయాంశంగా మారింది. అందరినీ కలవరపెడుతోంది కూడా. కొంతమంది ఇది మాంద్యం అని సమర్థిస్తుంటే మరి కొంతమంది ముఖ్యంగా ప్రభుత్వ వర్గాలు దీనికి ఒప్పుకోవడం లేదు. ఇది తాత్కాలిక చక్రీయ (సైక్లికల్) పరిణామమని, వ్యవస్థీకృత మాంద్యం (స్ట్రక్చరల్) కాదని, అంతగా భయపడాల్సిన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. నేడు మన ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన కొన్ని ప్రతికూల పరిణామాలను చూస్తుంటే దేశ ఆర్థిక వ్యవస్థ ముందు పెను ప్రమాదం పొంచి ఉందని అర్థమౌతోంది. సంక్షోభ ఛాయలు కానవస్తున్నాయి. అసలు ఇది ఎక్కడ మొదలైంది? నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి అనాలోచిత చర్యలతో ఈ దుస్థితి ప్రారంభ మయిందని నిపుణుల అభిప్రాయం. ఫలితంగా దేశ వృద్ధి రేటు 2017-18 నాల్గవ త్రైమాసికంలో నమోదైన 8.1 శాతం నుండి 2019-20 తొలి త్రైమాసికానికి 5 శాతానికి దిగజారింది. ఇది 25 త్రైమాసికాల కనిష్టం. పారిశ్రామిక వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి కేవలం 0.6 శాతం మాత్రమే నమోదైంది. రెండో త్రైమాసికానికి ఇంకా పతనమయ్యే అవకాశాలు మెండు. వ్యవసాయ రంగాన 2017-2018లో 5 శాతం వృద్ధి చోటు చేసుకోగా, 2018-19లో 2.8 శాతానికి తగ్గింది. 2019-20 తొలి త్రైమాసికానికి 2.1 శాతానికి కృశించింది. సేవారంగంలో కూడా 2018-19 మూడు, నాలుగు త్రైమాసికాలలో వృద్ధిరేటు తగ్గడం మొదలయింది. ఈ దుస్థితిని ఆర్‌బీఐ మాజీ గవర్నరు రఘురాం రాజన్ అప్పట్లోనే ఊహించి చెప్పారు. కేంద్రం ప్రకటిస్తున్న ఈ కొద్దిపాటి వృద్ధి రేట్లు కూడా వాస్తవాలు కాదని, బేస్ సంవత్సరం మార్చి ఎక్కువ చేసి చూపించినవని స్వయంగా ప్రధాని ముఖ్య సలహాదారుడే హార్వర్డ్ బిజినెస్ స్కూలులో జరిగిన ఒక సెమినార్‌లో ఉపన్యసించారు. నోట్ల రద్దు తొందరపాటు చర్య వల్ల మన ఆర్థిక వ్యవస్థ గడ్డు పరిస్థితులు ఎదుర్కొనడం సత్యసన్నిహితం. ముఖ్యంగా బ్యాంకింగ్ వ్యవస్థ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లు తయారైంది. అంతేగాక, అమ్మకాల క్షీణత, వ్యవసాయ దిగుబడుల తగ్గుదల, కుప్పలుగా పడి ఉన్న సరుకు నిల్వలు, ఫ్యాక్టరీల మూసివేత, కార్మికుల తొలగింపు వంటి వార్తలు తాజాగా తెరపైకి వస్తున్నాయి. ఈ పరిస్థితి తాత్కాలమా? లేక వ్యవస్థీకృతమా? తాత్కాలమయితే ఎన్నాళ్ళు? లేదా సంక్షోభ దిశగా ఆర్థిక వ్యవస్థ పయనిస్తోందా? నేడు అందరిలోనూ ఇవే ఆలోచనలు. వీటికి జవాబు రావాలంటే ముందు మాంద్యం అంటే ఏమిటి అన్నది తెలుసుకోవాలి.

మాంద్యం అంటే ఏమిటి? : దేశ ఆర్థిక వ్యవస్థలో వరుసగా రెండు త్రైమాసికాలలో వాస్తవ జీడీపీ తగ్గుముఖం పడితే ఆ పరిస్థితిని మాంద్యం (రిసెషన్) లేదా సంక్షోభం అంటారు. మాంద్యం వేరు, వృద్ధి క్షీణత వేరు. ఉదాహరణకు దేశంలో సంపద ఒక ఏడాది 90 కోట్లు అనుకుందాం. రెండో ఏడాది దేశ సంపద రు. 100 కోట్లకు పెరిగిందనుకుందాం. అంటే రెండో ఏడాది జీడీపీ వృద్ధి రేటు 11.1 శాతమన్నమాట. ఇక మూడో ఏడాది దేశ సంపద రు.105 కోట్లు అనుకుందాం. అంటే జీడీపీ వృద్ధి రేటు 5 శాతమన్నమాట. అంటే రెండో ఏడాది నమోదైన 11.1 శాతం నుండి మూడో ఏడాదికి 5 శాతానికి పడిపోయిందన్న మాట. మూడో ఏడాది వృద్ధి పెరుగుదల కనిపించినా, గత ఏడాది కన్నా వృద్ధి రేటు తక్కువ. దీనినే వృద్ధి క్షీణత అని అంటారు. ఇదే పరిస్థితి నేడు భారత్‌లో కొనసాగుతోంది.

**వణికిస్తున్న అంశాలు :** దేశంలో నిరుద్యోగం 45 ఏళ్ళ గరిష్ఠ స్థాయికి చేరింది. నేడు ముఖ్యంగా మూడు రంగాలు ప్రమాద పరిస్థితుల్లోకి నెట్టబడ్డాయి. వ్యవసాయం రంగంలో వేరుశనగ, ఆముదం, పత్తి వంటి పంటల దిగుబడి గణనీయంగా తగ్గింది. పారిశ్రామిక రంగంలో ఆటోమొబైలు రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. గత 19 సంవత్సరాల కనిష్ట స్థాయికి ఈ రంగం వాహనాల అమ్మకాలు పడిపోయాయి. లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. బిస్కట్ల అమ్మకాలు పడిపోవడంతో పార్లే 10 వేల మందిని తొలగించింది. దిగువ మధ్య తరగతి కుటుంబాలకు ఉపయోగపడే, తక్కువ ఖరీదు చేసే కార్ల అమ్మకాలు భారీగా దిగజారాయి. దేశంలో అత్యధిక జనాభా గల పేద, మధ్య తరగతి కుటుంబాల వినిమయం గణనీయంగా పడిపోతోంది. ప్రైవేట్ వినిమయ వ్యయం 2019 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 7.2 శాతం నమోదు కాగా 2020 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో 3.1 శాతానికి పడిపోయింది. ఇదే కాలంలో ప్రభుత్వ వినిమయ వ్యయం 13.1 శాతం నుండి 8.8 శాతానికి దిగిపోయింది. ఆర్థిక వ్యవస్థలో తీవ్ర మందగమన ఛాయలు అలుముకుంటున్నాయి. ఇక మూడో రంగం అయిన

నిర్మాణ రంగం కుదేలయింది. గత కొన్నేళ్ళుగా తయారైన ఇళ్ళు కొనుగోలు కావటం లేదు. ఈ రంగంపై సుమారు 250 రకాల పరిశ్రమలు, వృత్తిదారులు ఆధారపడి ఉన్నారు. తెల్ల వస్తువులుగా పిలిచే రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ వంటి వస్తువుల అమ్మకాలు పడిపోయాయి. ఈ వస్తువుల అమ్మకాల పెరుగుదల పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఆదాయాలు పెరుగుదలకు చిహ్నం. కీలక రంగాల వృద్ధి 11 నెలల కనిష్టానికి చేరిందని స్వయంగా మోడీ సర్కారే ప్రకటించింది. డాలరుతో పోటీపడలేక రూపాయి అంతకంతకూ నీరసించి పోతోంది. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్లు దారుణంగా పడిపోతున్నాయి. కోట్ల రూపాయలు ఆవిరి అయిపోతున్నాయి. వాస్తవ పరిస్థితులను చూస్తే మాత్రం దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో ఉందనే విషయం స్పష్టంగా తెలుస్తోంది. నోట్ల రద్దు వల్ల రైతులకు బ్యాంకుల నుంచి సకాలంలో రుణాలు లభించకపోవడంతో వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. 2008లో ప్రపంచాన్ని గడగడలాడించిన ఆర్థిక సంక్షోభం నుంచి దేశీయ గిరాకీయే మన ఆర్థిక వ్యవస్థను కాపాడింది. ఇప్పుడు ప్రపంచ మందగమనానికి తోడు దేశీయ మార్కెట్ డిమాండ్ పడిపోవడం తీవ్ర ఆందోళనను కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం డిమాండును పెంచే చర్యలపై ప్రధానంగా దృష్టి సారించకపోవడం గమనార్హం. ప్రస్తుతం సరఫరా (సప్లై) సమస్య కాదు. ఉత్పత్తి కార్యకలాపాలకు తోడ్పాటునందించే దిశగా ప్రకటిస్తున్న పలు సంస్కరణలు ఆర్థిక వ్యవస్థకు ఏ మాత్రం మేలు చేయవని ఆర్థికవేత్తలు చెబుతున్నారు.

ఇవికాక, ఇంకా వణికిస్తున్న అంశాలు మరికొన్ని ఉన్నాయి. 2018-19 ఏప్రిల్- జూన్ పెట్టుబడుల కన్నా 2019-20 అదే కాలంలో పెట్టుబడులు సుమారు 70 శాతం తగ్గాయి. హిందుస్థాన్ లీవర్, డాబర్, బ్రిటానియా ఈ మూడు కంపెనీల వృద్ధి రేటు మూడో వంతు తగ్గింది. ఎంఎస్ఎంఈలకు బ్యాంకు రుణాలు తగ్గాయి. భారత్ అతి తొందరగా అభివృద్ధి చెందుతున్న దేశమని ప్రపంచ దేశాలన్నీ చెబుతున్న సమయంలో ఈ పరిస్థితి నెలకొనడం శోచనీయం. చివరకు రు.5ల బిస్కట్లను కూడా ప్రజలు కొనలేని స్థితిలో ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఆర్థిక వ్యవస్థను పరుగులెత్తించే ఇంజన్లు నాలుగు అవి 1) స్థూల మూలధన కల్పన 2) ప్రభుత్వ వ్యయం 3) ప్రైవేటు వినిమయం 4) నికర ఎగుమతులు. స్థూల మూలధన కల్పన జీడీపీలో సాధారణంగా 30 నుంచి 32 శాతం వరకూ ఉంటుంది. ఇది 2011-12లో 34.3 శాతం ఉండగా 2017-18లో 28.6 శాతానికి దిగజారింది. పాలనా నిర్వహణ వ్యయం, ప్రజలకు అందించే వస్తుసేవల వ్యయమే ప్రభుత్వ వ్యయం. జీడీపీలో సాధారణంగా దీని వాటా 10 శాతం. 2018-19 ఆర్థిక సంవత్సరం సగటు ప్రభుత్వ వ్యయమైన 11.28 శాతం నుంచి 2019-20 తొలి త్రైమాసికానికి 8.9 శాతానికి తగ్గింది. 2019 కేలండరు ఏడాది ఆరు నెలల సగటు ఇది 10.95 శాతం. అలాగే 2018-19 నాల్గవ త్రైమాసికానికి ఇది 13.1 శాతం. ఇక ప్రైవేటు వినిమయం పైన చెప్పినట్టు 2018-19 నాలగవ త్రైమాసికానికి 7.2 శాతం వృద్ధి నమోదు కాగా, 2019-20 మొదటి త్రైమాసికానికి ఇది కేవలం 3.1 శాతం మాత్రమే. సాధారణంగా జీడీపీలో దీని వాటా 55-58 శాతం మధ్యన ఉంటుంది. ఇక నికర ఎగుమతుల విషయం గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1972-73లో నమోదైన వాణిజ్య మిగులు రు.104 కోట్లు, 1976-77లో నమోదైన రు.69 కోట్లు మినహా మరే ఇతర సంవత్సరాలలోనూ నికర ఎగుమతులు (ట్రేడ్ బ్యాలన్స్) నమోదు కాలేదు. దిగుమతుల కన్నా అధికంగా ఉన్న ఎగుమతులనే నికర ఎగుమతులంటారు. దేశ ఆర్థిక వ్యవస్థ పతనానికి అంచున ఉందని మాజీ ప్రధాని, ఆర్థిక శాస్త్రవేత్త మన్మోహన్‌సింగ్ వాపోయారు. నోట్ల రద్దు చర్య ఒక పెద్ద తప్పిదమని కూడా అన్నారు. ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడానికి ఆయన సూచనలు కూడా చేశారు. పెద్ద నోట్ల రద్దు వేగంగా వెళుతున్న కారును తుపాకీతో పేల్చడం వంటిదని ఫోర్బ్స్ పత్రిక ఎడిటర్ పేర్కొన్నారు. కొండనాలుకకు మందువేస్తే ఉన్న నాలుక పోయినట్లయింది ఈ చర్య అని మరికొందరు వ్యాఖ్యానించారు. బలహీనంగా ఉన్న బ్యాంకులను బలంగా ఉన్న బ్యాంకులతో విలీనం మంచి చర్య కాదని కూడా మాజీ ప్రధాని అన్నారు. ఈ చర్య వల్ల ప్రభుత్వం భావిస్తున్నట్లు బలహీనంగా ఉన్న బ్యాంకులు బలంగా ఉన్న బ్యాంకులతో విలీనం చేస్తే అవి కూడా బలంగా తయారవుతాయనుకోవడం ఎంత నిజమో, బలంగా ఉన్న బ్యాంకులు కూడా వీటి ప్రభావం వల్ల బలహీనంగా మారుతాయన్నది కూడా అంతే నిజమని ఆయన పేర్కొన్నారు. భారతఆర్థిక వ్యవస్థకు విదేశీ మార్కెట్ అవసరం తక్కువనే చెప్పాలి. మనకున్న 130 కోట్ల జనాభాయే చాలు. అత్యధిక మధ్యతరగతి జనాభా మనకు పెద్ద ఆస్తి. మన జనాభాలో ముఖ్యంగా పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఉపాధి కల్పించి, వారి కొనుగోలు శక్తి పెంచి మరో ప్రక్క దిగుమతులను నియంత్రించ గలిగితే చాలు. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకుని చర్యలు తీసుకుంటే సంక్షోభం నుంచి గట్టెక్కవచ్చు. రాబోయే రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం వస్తుందని విశ్లేషకులు చెబుతున్న నేపథ్యంలో ఈ చర్యలు అత్యంత కీలకం. ❑

# మోదీ పూసిన మలాము


**మాడభూషి శ్రీధర్**

బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్

కేంద్ర సమాచార మాజీ కమిషనర్




రాజ్యాంగం (జమ్మూకశ్మీర్‌కు వర్తింపు) ఉత్తర్వు 2019 అనే పేరుతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఒక ఉత్తర్వు జారీ చేశారు. అది గెజిట్‌లో ప్రచురించి దాని ప్రతిని అమిత్‌షా పార్లమెంటులో ప్రకటించి తర్వాత తీర్మానంగా మార్చి ఓటింగ్‌కు పెట్టారు. పార్లమెంటు ఆమోదించిన తరువాత కేంద్ర మంత్రి మండలి రాష్ట్రపతి చేత ఉత్తర్వు సంతకం చేయించిందని అనుకోవాలా? లదాఖ్‌ను జమ్మూకశ్మీర్ నుంచి విడదీసి రెండింటినీ విడివిడిగా కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించే జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు 2019 రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. జమ్మూకశ్మీర్‌కు ఇక గవర్నర్ ఉండరు. కేంద్ర హోంమంత్రికి నివేదించే కింది ఉద్యోగిగా లెఫ్టినెంట్ గవర్నర్ ఉంటారు. కశ్మీర్ సీఎం కన్నా శ్రీనగర్ మేయర్‌కు ఎక్కువ అధికారాలుంటాయి. ఆర్టికల్ 370 రాజ్యాంగం 21వ భాగంలోని అనేక ప్రత్యేక తాత్కాలిక నియమాలలో ఒకటి. దీన్ని అనుసరించి 1954 ఆర్డర్ ద్వారా రాష్ట్రపతి ఆర్టికల్ 35ఎ చేర్చారు.

ఇది రాజ్యాంగం ప్రధానభాగంలో కనిపించదు. చివరన అనుబంధం1లో ఉంటుంది. జమ్మూకశ్మీర్ శాశ్వత నివాసులెవరు, వారి ప్రత్యేక హక్కులు, అధికారాలు ఏమిటి అని ఇది వివరిస్తుంది. 35ఏని రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చకుండా 370 దారిలో చేర్చడం తప్పు అని వాదిస్తూ ఒక పిటిషన్ ఇంకా విచారణలో ఉంది. ఆర్టికల్ 370 తాత్కాలిక నియమం. దీన్ని మార్చాలన్నా, తొలగించాలన్నా, కొనసాగించాలన్నా అధికారం జమ్మూకశ్మీర్ రాజ్యాంగ నిర్ణాయకసభకు మాత్రమే ఉంది. రాజ్యాంగసభ తమ కోసం రాజ్యాంగం రూపొందించి, ఆమోదించి, 370 కొనసాగించాలని నిర్ణయించి, అందులో మార్పులు చేయాలంటే రాజ్యాంగసభ సిఫార్సు అవసరమని నిర్ధారించి రాజ్యాంగ సభను రద్దు చేసింది. జనాభిప్రాయసేకరణ చేసి అందుకు అనుగుణంగా శాశ్వత నియమం చేసేందుకుగాను 370ని తాత్కాలికం అన్నారని రాజ్యాంగ నిపుణుల అభిప్రాయం. ఈ 370 ఒక మోసమని, ఈ తాత్కాలిక నియమం తొలగించాలని కుమారి విజయలక్ష్మి ఝా 2017లో ఢిల్లీ హైకోర్టులో యూనియన్ ఆఫ్ ఇండియా కేసును కొట్టివేశారు. (https://indiankanoon.org/doc/153910827/).

రాజ్యాంగంలో తాత్కాలికం అని రాసి ఉన్నప్పటికీ 370 తాత్కాలికం కాదని ఏప్రిల్ 2018లో సుప్రీంకోర్టు మరో కేసులో చెప్పింది. 2017లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసు (https:// indiankanoon.org/doc/105489743/) వింటూ సుప్రీంకోర్టు జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేందుకు చారిత్రక కారణాలు ఆధారమని సమర్థించింది. ఎస్‌బీఐ కేసులో సుప్రీంకోర్టు మన రాజ్యాంగం ఫెడరల్ రాజ్యాంగమనీ, కశ్మీర్‌కు ప్రత్యేక హోదా అవసరమనీ, 370 తాత్కాలికం కాదనీ మళ్లీ చెప్పింది. 369 ఆర్టికల్‌కు అయిదేళ్ల కాలపరిమితి ఉంది. 370లో అదేమీ లేదు. జమ్మూకశ్మీర్ రాజ్యాంగసభ ఆమోదం లేకుండా 370ని తొలగించడానికి వీల్లేదని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. పార్లమెంటుకు, రాష్ట్రపతికి 370(2) తాత్కాలిక నియమాల కింద లభించిన అధికారాలు జమ్మూకశ్మీర్ రాజ్యాంగసభ తుది ఆమోదం పైనే కొనసాగుతాయని 1959లో ప్రేమ్‌నాథ్ కౌల్ కేసులో అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం (https:// indiankanoon.org/doc-/816126/) నిర్ణయించింది. జమ్మూకశ్మీర్ రాజ్యాంగసభ రద్దయిన తరువాత కూడా 370 కొనసాగుతుందని, అది ఎన్నడూ నిలిచిపోదని అయిదుగురు జడ్జీల సుప్రీంకోర్టు ధర్మాసనం వివరించింది. ఏ ట్రీటీలో (ఒప్పందం), అక్సెసన్ డీడ్‌లో, కోర్టు తీర్పులో, చట్టంలో, నియమాల్లో, ఆచారంలో, వాడుకలో ఏమున్నా తమ ఉత్తర్వు మాత్రమే చెల్లుతుందని ఆగస్టు 5 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులో పేర్కొన్నట్టు హోంమంత్రి పార్లమెంటు ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు. అంతకుముందు 370ని కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా దారుణంగా దుర్వినియోగం చేశాయి.

రాజ్యాంగంలోని కేంద్ర అధికారాల జాబితాలోని 97 ఎంట్రీలలో 94 జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశాయి కాంగ్రెస్ ప్రభుత్వాలు. 395 అధికరణాలలో 260 వర్తిస్తాయి. 12 షెడ్యూళ్లలో 7

☞ మిగతా 24వ పేజీలో

# బి.జె.పి. ఆధిపత్య రాజకీయం

యోగేంద్ర యాదవ్



శాసనసభ ఎన్నికల్లో బిజెపి సాధించిన దిమ్మతిరిగే విజయాలు జాతీయ రాజకీయాలలో ప్రవేశించిన ఒక నూతన దశకు సంకేతం. బిజెపి కేంద్రంలోనూ, కొన్ని రాష్ట్రాలలోనూ అధికారం చెలాయించే పార్టీ మాత్రమే కాదు. జాతీయ రాజకీయాలను తన చుట్టూ తిప్పుకోగలిగిన ధృవంగా మారింది. జాతీయ రాజకీయాలలో ఒక ఆధిపత్య పార్టీగా బిజెపీ నేడు రూపుదాల్చింది. ఒకప్పుడు ఇందిరా గాంధీ చెలాయించిన ఆధిపత్య స్థాయికి నరేంద్రమోదీ చేరుకున్నారు.

దిగమింగలేని కఠోరవాస్తవమిది. నవీన భారతం గురించి మోదీ దృక్పథాన్ని వ్యతిరేకించే వారందరికీ కలవరం కలిగించే విషయమిది. నేనుకూడా అటువంటి వారి కోవకే చెందుతాను. భారత్ అనే భావనకే మోదీ వ్యతిరేకం. మోదీ రాజకీయాల పట్ల ఇష్టం కలిగి ఉండటం లేదా వ్యతిరేకించడం వేరు. ఆయన ప్రస్తుత స్థితి ఏమిటనే అంచనా వేయడం వేరు. మోదీ విమర్శకులు తిరస్కరణలో జీవించే తప్పు చేస్తున్నారు. తన సొంత బరువు భరించలేక మోదీ ప్రభుత్వం తనంతట తానుగా కుప్పకూలి పోతుందని గత రెండేళ్ళుగా వారంతా ఊహిస్తూ వచ్చారు. 2015లో ఢిల్లీలో, 2016లో బీహారులో బిజెపి చవిచూసిన ఘోర పరాజయాన్ని చూసి వారంతా ఉపశమనం పొందుతున్నారు. నోట్ల రద్దు బిజెపికి అనివార్యమైన పరాభవాన్ని మిగులుస్తుందని వారు జోస్యం చెప్పారు. కానీ అటువంటిదేమీ జరగలేదని స్పష్టంగా తేలిపోయింది. బిజెపిని తీవ్రంగా వ్యతిరేకించే వారెవరయినా ఈ వాస్తవాన్ని గుర్తించి తీరాలి. 'ఆధిపత్యం' అంటే కేవలం అధికారంలో వుండటం మాత్రమే కాదు. న్యాయసమ్మతితో కూడిన అపారమైన అధికారం కలిగి ఉండటం. బిజెపి ఆధిపత్యం కలిగి వుందీ అంటే అసలు అర్థం దాని పశుబలానికి ప్రజామోదం పొందుతున్నదని! చాలా మంది ప్రధాన మంత్రులు తమ పదవీ కాలం ప్రారంభమైన తొలి దినాలలో ప్రజాదరణ చూరగొన్నవారే. అయితే నరేంద్రమోదీ మాత్రం కేవలం అటువంటి ప్రజాదరణ పొందిన నేత మాత్రమే కాదు. జాతి మనోభావనలను అంతగా వశపరచుకున్న నేత ఇటీవలి కాలంలో మరొకరు లేరని చెప్పాలి. జనబాహుళ్యం యొక్క సాధారణ వివేకాన్ని బిజెపి రూపొందిస్తున్నది.

బిజెపి ఆధిపత్యంలో మరికొన్ని అంశాలు ఉన్నాయి. అందులో మొదటిది గతంలో కొన్ని కేంద్ర ప్రభుత్వాలు మాత్రమే పొందిన మందబలం బిజెపీకి దక్కింది. ఆ పశుబలాన్ని బిజెపి సమర్థంగా వినియోగించుకుంటున్నది. చట్టబద్ధంగా తనకు దక్కిన రాజ్యాంగ అధికారాన్ని విచ్చలవిడిగా వాడుకుంటున్నది. రాజ్యాంగ సంస్థలను తన కాలి కింద తొక్కి పెట్టి వుంచుకోవడానికి తనకు గల కార్యనిర్వాహక అధికారాన్ని వాడుకోవడంలో బిజెపి ఆరితేరింది. మరి కాంగ్రెస్ అయితే అలా చేయలేకపోయింది. విద్య, సంస్కృతి నుండి రక్షణ వరకూ వివిధ రంగాలలో తమ అజెండాను ముందుకు తీసుకువెళ్ళగలిగే నమ్మకమైన వ్యక్తులను మోదీ ప్రభుత్వం నియమించుకున్నది. తమ ఆలోచనలకు భిన్నమైన నిర్ణయాలను తిరగతోడటానికి చట్టబద్ధమైన అధికారాన్ని వినియోగిస్తున్నది. అరుణాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టడం, గోవా, మణిపూర్ రాష్ట్రాలలో తమ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం, ప్రతిపక్షాల ఆమోదం పొందలేని బిల్లులను రాజ్యసభకు పంపకుండానే చట్టాలుగా మార్చేయడం వంటివన్నీ ఈ కోవలోని చర్యలే. చట్టబద్ధ చట్రంలోనే వీటన్నిటినీ చేయిస్తున్నట్లు పైకి కన్పిస్తున్నప్పటికీ, వీటితో పాటు హింసాత్మక చర్యలు, బెదిరింపులు, సంజయ్ గాంధీ బి గ్రేడ్ కాలం నాటి భయపెట్టే చర్యలనూ బిజెపి జోడిస్తున్నది.

దేశవ్యాప్తంగా వివిధ విశ్వవిద్యాలయాలలో ఎ.బి.వి.పి. కొనసాగిస్తున్న గూండాయిజం, హక్కుల కార్యకర్తలపై కొనసాగుతున్న దాడులు ఈనాడు నిత్యకృత్యమైపోయాయి.

బిజెపి ఆధిపత్యంలోని రెండో అంశం ఇటీవల కాలంలో అత్యున్నత స్థాయికి చేరుకున్న దాని ఎన్నికల ప్రాబల్యం. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో బిజెపి సాధించిన విజయం కేవలం అద్భుతం మాత్రమే కాదు. అక్కడ గెలిచిన స్థానాల సంఖ్య మున్నెన్నడూ లేని విపరీత స్థాయిలో వుంది. 2014లో బిజెపి సాధించిన విజయం అద్భుతమైనదే. కాని రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా ప్రభుత్వ వ్యతిరేకత కన్పించని రాష్ట్రంలో, పైగా తనకంటూ చూపించుకోవడానికి ఒక రాష్ట్ర స్థాయి నాయకుడు లేని రాష్ట్రంలో బిజెపి సాధించిన ఈ విజయం విశేషమైనదే. గోవాలో తమ ప్రభుత్వం పైనా, పంజాబ్‌లో తమ

మిత్రపక్షం పైనా వున్న ప్రభుత్వ వ్యతిరేకతని మోదీ తొలగించ లేకపోయిన మాట నిజమే కానీ మణిపూర్‌లో బలమైన ప్రవేశం, అసోంలో సాధించిన ఘనవిజయం, ఒడిశాలో సాధిస్తున్న విజయాలు, దక్షిణాది రాష్ట్రాలలో విస్తరిస్తున్న పాదముద్రలు దేశవ్యాప్తంగా ఒక ప్రబలమైన శక్తిగా బిజెపిని నిలబెట్టాయి. కాంగ్రెస్ పార్టీ ఏవో కొన్ని రాష్ట్రాలకే పరిమితమై వేగంగా కుదించుకుపోతున్నది. గత పదేళ్ళుగా చూస్తే కాంగ్రెస్ బిజెపీలు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్నట్లుగా కన్పిస్తున్నది.

ఇక మూడో అంశం బిజెపి పాలనకు ప్రజల నుండి లభిస్తున్న సైద్ధాంతిక, నైతిక ఆమోదం. ప్రారంభ దినాల సానుకూల వాతావరణపు పరిమితికి మించిన కాలానికి తన ప్రజాదరణను నరేంద్ర మోదీ విస్తరించుకోగలిగారు. నోట్ల రద్దు వంటి పరిహాసాస్పదమైన చర్య ద్వారా కలిగిన భంగపాటు నుండి నరేంద్ర మోదీ బతికి బట్టకట్టిన వైనం చూస్తే సామాన్య ప్రజలు ఆయనను ఇంకా విశ్వసిస్తున్నారనీ, ఆయన తప్పులను క్షమించడానికి సిద్ధంగా వున్నారని అవగతం అవుతుంది. బిర్లా, సహారా కేసులో వెలుగులోకి వచ్చిన భీతి గొలిపే అంశాల మచ్చ ఆయనకు అంటుకోలేదని కూడా తేటతెల్లమయ్యింది. రాజకీయ పార్టీలు సాధారణంగా సాగించే పాక్షిక రాజకీయ పోరాటాలకు అతీతంగా తాను జాతి ప్రయోజనాల కోసం నిలబడుతున్నట్లుగా ప్రజల్ని ఒప్పించడంలో మోదీ విజయవంతమయ్యారు. బలిసిన నల్లధన స్వాములకు వ్యతిరేకంగానే తాను నోట్లరద్దు చర్య చేపట్టానని చెప్పిన కథనాన్ని నమ్మేట్లు మోదీ చేయగలిగారు. అన్నిటినీ మించి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నంలో భాగంగా "జాతీయవాదం" పై జరిగిన వాదనా యుద్ధంలో బిజెపి పైచేయి సాధించగలిగింది. స్వాతంత్ర్యోద్యమంలో వీసమెత్తు పాత్ర కూడా లేని బిజెపి ఈనాడు 'జాతీయవాదం' అనే అంశంపై పౌరుల సాధారణ వివేకాన్ని రూపొందిస్తోంది. అయితే బిజెపి సాధించిన చట్టబద్ధ సమ్మతిలో మూడు ప్రధానమైన పరిమితులు ఉన్నాయి. ఈ చట్టబద్ధ సమ్మతి పరిధిలో యావత్తు జాతిని బిజెపి ఇముడ్చుకోలేకపోతున్నది. మైనారిటీలను ఆ పరిధి నుండి తొలగించడానికి స్థిరంగా ప్రయత్నిస్తున్నది. మోదీ పట్ల వారికి ఉత్సాహపూరితమైన స్పందన లేకపోవడం మాత్రమే కాదు, ముస్లిములను క్రైస్తవులను తన పరిధి నుండి బైటకు నెట్టడానికి మోదీ ఉద్దేశ్యపూర్వకంగా ప్రయత్నిస్తున్నారు. తాను ముస్లిములను పట్టించుకోనని చూపడం ద్వారా హిందూ సమాజంలో తన సమ్మతిని పెంచుకోవడానికి మోదీ ప్రయత్నిస్తుంటారు.

మోదీకి లభిస్తున్న ఆమోదం స్వతస్సిద్ధంగా రావడం లేదనే అంశాన్ని కూడా మనం గమనించాలి. ప్రధానమంత్రికి అటువంటి జనామోదం సృష్టించడం కోసం కట్టుకథల్ని సృష్టించడం, మోదీ గురించిన అవాస్తవిక ప్రతిబింబాన్ని రూపొందించడం, మీడియాను తప్పుడు పద్ధతుల్లో వినియోగించడం వంటివన్నీ గట్టిగా జరుగు తున్నాయి. అత్యవసరం పరిస్థితి తర్వాత ప్రభుత్వ ఒత్తిడి ఇంత తీవ్రస్థాయిలో వుండే పరిస్థితిని మీడియా ఏనాడూ ఎదుర్కోలేదు. అయితే ఇటువంటి ప్రాబల్యం స్వభావసిద్ధంగానే డొల్లతనంలో ఉంటుంది. ప్రస్తుతానికి అది అద్భుతంగానే కన్పించినా, ఏదో ఒక దెబ్బ తగలగానే పేకమేడలా కుప్పకూలి పోతుంది. అసలు నిజానికి అటువంటి జనాదరణకు వాస్తవిక పునాది లేదు. ఆర్థిక వృద్ధి రేటు దిగజారింది. గ్రామీణ దురవస్థ నిరాటంకంగా కొనసాగుతోంది. నిరుద్యోగ వ్యథ పరిస్థితీ అంతే. ఈ ప్రభుత్వం అతి గొప్పగా చెప్పుకునే స్వచ్ఛ భారత అభియాన్, ప్రధానమంత్రి ఫసలీ బీమా యోజన వంటి పథకాలు ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు.

మన ప్రజాస్వామ్యానికి సంబంధించినంత వరకు ఈ ఆధిపత్యం అంటే అర్థం ఏమిటి? విధాన నిర్ణయాలు తీసుకోవడం లో ప్రభుత్వానికి కావలసినంత వెసులుబాటు లభిస్తుందనడంలో సందేహం లేదు. అందువల్లనే నోట్ల రద్దు వంటి క్షణికమైన నిర్ణయాలను ప్రభుత్వం ముందుకు తీసుకురాగలిగింది. ప్రభుత్వానికి ఏ విధమైన అవరోధమూ ఎదురు కాలేదు. కాని అదే సమయంలో పాలనా వైఫల్యాలకు సాకులు చెప్పి తప్పించుకునే అవకాశమూ ఇందులో లేదు. అయితే మన ప్రజాస్వామ్యానికి ఆధిపత్యం అనేది పెనుసవాలుగా మారుతుంది. ప్రజాస్వామ్యానికి అవసరమైన స్థలాలు నానాటికి వేగంగా కుదించుకుపోయే ప్రమాదం ఇందులో దాగి వుంది. ప్రభుత్వానికి సంక్రమించిన అహంకార గర్వం ఈ ఆధిపత్యం కారణంగా మరింత పటిష్టం అవుతుంది. ఫలితంగా మన రిపబ్లిక్‌కు చెందిన మౌలిక విలువలపై తీవ్రదాడిని మనం చూడాల్సి వస్తుంది.

ఈ పరిస్థితుల్లో ఆధిపత్యాన్ని ఎదుర్కోవడం ఎలా? సాదా ప్రతిపక్ష భావనతో దీనిని ఎదుర్కోలేమన్న విషయాన్ని గుర్తు చేయడానికే దీనిని ఆధిపత్యం అని పిలవడంలోని ప్రధాన ఉద్దేశ్యం. సాహసోపేతమైన ముఖాముఖి వీధి పోరాటాలు కూడా పనిచేయకపోవచ్చు. బిజెపిని ఎదుర్కోవడానికి ప్రతిపక్షాలు ఏర్పాటుచేసే మహాకూటమి వంటివి సైతం ప్రతికూల ఫలితాలను ఇచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం సాధించిన సైద్ధాంతిక, నైతిన న్యాయ సమ్మతిని ఎదుర్కోవడానికి అవసరమైన సాంస్కృతిక పరికరాలను, పనిముట్లను అభివృద్ధి చేసుకోవడం ద్వారానే ఆధిపత్యాన్ని ఎదిరించగలం. ❑

# హిందూ మెజారిటీవాదం వ్యాప్తి కోసమే ఎన్.ఆర్.సి.

డి. సోమసుందర్



జాతీయ పౌరసత్వ రిజిష్టరు తుది జాబితా వెలువడిన తర్వాత కూడా అస్సాంలో పరిస్థితులు కుదుటపడటం లేదు. అస్సాంలోకి అక్రమంగా వలస వచ్చి స్థిరపడిపోయిన విదేశీయుల సంఖ్య గురించిన తమ వాదనలు చెల్లుబాటు కాకపోవడంతో ఉద్యమకారులు సమస్యను తిరగతోడే ప్రయత్నం ప్రారంభించారు. ఎన్.ఆర్.సి. తుది జాబితాను అంగీకరించబోమని, అందులో అర్హులకు చోటు దక్కకపోగా, అనర్హులు దొడ్డిదారిన చోటు సంపాదించారని అస్సాంలో పాలకపక్షంగా వున్న బిజెపి నేతలు ప్రకటించారు. ఎన్.ఆర్.సి. రూపకల్పనకు తీసుకున్న ప్రాతిపదిక సంవత్సరం 1971గా పెట్టడం తప్పని, దానిని 1951గా మార్చాలని తాజా వ్యాజ్యం ఒకటి సుప్రీంకోర్టులో దాఖలు అయ్యింది. అస్సాం ఉద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకునే హిందూ మతోన్మాద, ప్రాంతీయ తత్వ సంస్థలు సమస్యను మరింతగా రగిలించే ప్రయత్నాలు ప్రారంభిస్తున్నాయి. మరో వంక బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఎన్.ఆర్.సి. ప్రక్రియని దేశవ్యాప్తంగా చేపట్టాలని అంటున్నారు. ముఖ్యంగా పశ్చిమబెంగాల్, ఢిల్లీ, తెలంగాణా రాష్ట్రాలలో దీన్నో ప్రధాన సమస్యగా ప్రచారంలోకి తెచ్చేందుకు బిజెపి నేతలు సమాయత్తం అవుతున్నారు. ఈ నేపథ్యంలో అస్సాంలో జరిగిన ఎన్.ఆర్.సి. ప్రక్రియను పరిశీలించాల్సి ఉంది.


అస్సాం రాష్ట్రానికి సంబంధించిన నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజన్స్ తుది జాబితా ఆగస్టు 31న వెలువడింది. అస్సాంలో నివశిస్తున్న 68.27 లక్షల కుటుంబాలకు చెందిన 3.29 కోట్ల మంది తాము భారతీయులమేనని గుర్తింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. తమ పౌరసత్వ గుర్తింపునకు రుజువుగా ఆరున్నర కోట్ల ధృవపత్రాలను వారు అందచేసారు.

ప్రపంచంలోనే పౌరసత్వ గుర్తింపు కోసం ఒక అతి పెద్ద ప్రక్రియ ప్రారంభమయ్యింది. 67 వేల మంది ప్రభుత్వోద్యోగులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రోజువారీ పాలనా కార్యకలాపాలను పక్కన పెట్టి ఎన్.ఆర్.సి. ప్రక్రియలో పాలు పంచుకున్నారు. పౌరులకు సహాయపడేందుకు రాష్ట్రంలో 2500 ఎన్.ఆర్.సి. కేంద్రాలు పనిచేసాయి. 1500 కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. తుది జాబితా ప్రకటనతో ప్రక్రియ ఒక కొలిక్కి వచ్చిందని అందరూ భావించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 3.10 కోట్ల మంది భారతీయ పౌరులేనని ఎన్.ఆర్.సి. సంస్థ ప్రకటించింది. మరో 19 లక్షల మంది తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకునే ఆధారపత్రాలను సమర్పించలేకపోయారని పేర్కొన్నది. జాబితాలో చోటు దక్కకపోయినంత మాత్రాన వీరంతా అక్రమంగా వలస వచ్చిన విదేశీయులు అనుకోవడానికి వీల్లేదని, వారు ఆధార పత్రాలను సమర్పించడానికి, పౌరసత్వ గుర్తింపు రుజువు చేసుకోవడానికి అవకాశం ఇస్తామని తెలిపింది. వీరంతా తమ పౌరసత్వ గుర్తింపును ధృవీకరించుకునేందుకు అస్సాంలో ఏర్పాటు చేసిన ఫారిన్ ట్రిబ్యునల్స్ ముందు 120 రోజులలోగా హాజరు కావచ్చు. ఆ తర్వాత తమకు న్యాయం జరగలేదని భావిస్తే హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం కల్పించారు.

అస్సాంలో విదేశీయుల సమస్యను ఒక తీవ్ర సమస్యగా చిత్రీకరిస్తూ గత నాలుగు దశాబ్దాలుగా ఉద్యమం కొనసాగిన సంగతి తెల్సినదే. అక్రమ వలసదారులతో అస్సాం నిండిపోతోందని, భూములను, ఉద్యోగాలను, ఉపాధిని బైటి వారు కొల్లగొడు తున్నారని, అస్సామీయ సంస్కృతిని అక్రమ వలసదారులు ధ్వంసం చేస్తున్నారని ఉద్యమకారులు ఆందోళనలు సాగించారు. మంగళదోయ్ పార్లమెంటరీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా ఓటర్ల జాబితాలో 35 శాతం పెరుగుదల కన్పించిందన్న సమస్యతో 1979 నాటి అస్సాం విద్యార్థి ఉద్యమం ప్రారంభమయ్యింది. 1985 వరకూ హింసాత్మకంగా సాగిన ఉద్యమంలో 860 మంది అశువులు బాసినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. ఇదే నేపథ్యంలో నెల్లీలో జరిగిన మారణకాండలో 2,191 మంది ముస్లిములను ఊచకోత కోశారు. బంగ్లాదేశ్ నుండి అక్రమంగా విదేశీయులు

వలస వచ్చేస్తున్నారన్న భావనతో ప్రారంభమైన ఉద్యమానికి ప్రాంతీయ తత్వంతో పాటు మతోన్మాదం తోడయ్యింది. విదేశీయులకు వ్యతిరేకంగా మొదలైన ఉద్యమం కాస్తా ముస్లిములకు వ్యతిరేకంగా రూపాంతరం చెందింది. హిందూ మతోన్మాద శక్తులు ఏళ్ళ తరబడి సాగించిన ప్రచారం అస్సామీ సమాజంలో ఒక తీవ్ర విభజన తెచ్చింది. ఒక విద్వేష అసహనపూరిత వాతావరణం ఏర్పడింది.

విదేశీయులు, ముఖ్యంగా ముస్లిములు అస్సాంలోకి వలస వచ్చి స్థిరపడి పోతున్నారన్న భావన దేశవ్యాప్తంగా విస్తరింప చేయడంలో హిందూ మతోన్మాద శక్తులు విజయం సాధించాయి. వలస వచ్చిన విదేశీయుల సంఖ్య గురించిన అపోహలు, అవాస్తవాలు ప్రభుత్వ వర్గాలలో కూడా వ్యాప్తి అయ్యింది. దేశంలోకి అక్రమంగా వలస వచ్చిన బంగ్లాదేశీయుల సంఖ్య 1 కోటి మంది వరకూ ఉంటారని, అందులో అస్సాంలోకి వచ్చిన వారి సంఖ్య 50 లక్షలని, 1997లో నాటి హోమ్ మంత్రి ఇంద్రజిత్ గుప్తా పార్లమెంటులో తెలిపారు. నాటి అస్సాం గవర్నర్ ఎ.కె.సిన్హా ఈ సంఖ్య అంతకంటే ఎక్కువేనన్నారు. ఉద్యమకారులు ఈ సంఖ్య 1 కోటి మంది వరకూ వుంటుందని ప్రచారం చేసేవారు. ఉద్యమకారులు చెప్తున్న అంకెలనే తాము ఉదహరిస్తున్నామని, అయితే గణాంకాలను నిర్ధారించే రుజువులు, సాక్ష్యాలు ఏమీ లేవని అప్పటి గవర్నర్ ఎ.కె.సిన్హా ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.



1985లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా వున్న కాలంలో అస్సాం ఒప్పందం జరిగింది. అస్సాంలోకి వలసలు జరిగిన అంశాన్ని ప్రభుత్వం కాదనలేదు. 1826 నాటి నుండి బ్రిటీష్ ప్రభుత్వ ప్రోత్సాహంతో వలసలు జరిగిన మాట నిజమే. భారత భూభాగం ఏకఖండంగా వుండటంతో జరిగిన సహజమైన వలసలు అవి. 1947 దేశవిభజన సమయంలో మరోసారి వలసలు ఎడాపెడా జరిగాయి. 1971 బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో మరోసారి వలసలు జరిగాయి. చారిత్రకాంశాలన్నిటినీ దృష్టిలో వుంచుకుని పౌరసత్వ జాబితాను రూపొందించాలని అస్సాం ఒప్పందంలో పొందుపర్చడం జరిగింది. రకరకాల రాజకీయ, సామాజిక, సాంకేతిక కారణాలతో ఎన్.ఆర్.సి. ప్రక్రియలో జాప్యం జరిగింది. డా॥మన్మోహన్ సింగ్ హయాంలో ఈ ప్రక్రియ తిరిగి మొదలయ్యింది. ప్రస్తుత అస్సాం ముఖ్యమంత్రి సర్వానంద్ సోనోవాల్ సహా పలువురు వ్యక్తులు, సంస్థలు సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యాల పర్యవసానంగా ఎన్.ఆర్.సి. ప్రక్రియ పర్యవేక్షణ బాధ్యతను సర్వోన్నత న్యాయస్థానం తన నెత్తిన వేసుకున్నది.

అంతర్జాతీయ ఒప్పందాలకూ, అవగాహనలకూ, జాతీయ పౌరసత్వ చట్టానికీ విరుద్ధంగా అస్సాం ఎన్.ఆర్.సి. ప్రక్రియ మొదలయ్యింది. ఒక రాష్ట్రంలో ఇటువంటి ప్రక్రియ చేపట్టవచ్చా అనే అంశంపై వ్యాజ్యం సుప్రీంకోర్టులోనే అపరిష్కృతంగా వుంది. ఈ పరిస్థితుల్లో సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమైన ఒక అమానవీయ ప్రక్రియ చేపట్టడమే అనాగరిక చర్య అనుకుంటే, దాని బాధ్యతను సుప్రీంకోర్టు తన నెత్తిన వేసుకోవడం పెద్ద విషాదం. తమ గుర్తింపును రుజువు చేసుకునే బాధ్యత పౌరుల మీదే మోపడం కూడా ఘోరమైన తప్పిదం.

లక్షలాది కుటుంబాలు తమ పౌరసత్వాన్ని రుజువు చేసుకోవడానికి పడరాని ఇక్కట్లు పడ్డాయి. అవమానాలకూ, వివక్షలకూ గురయ్యాయి. భారత్‌లో జన్మించిన వారంతా భారతీయ పౌరులేనన్న భారతీయ పౌరసత్వ చట్టానికి అస్సాంలో తూట్లు పడ్డాయి. 1951లో అస్సాంలో తయారైన తొలి

ఎన్.ఆర్.సి.ని ఒక ప్రాతిపదికగా, 1951 నుండి 1971 వరకూ తయారైన ఓటర్ల జాబితాలను మరో ప్రాతిపదికగా, ప్రభుత్వం జారీ చేసిన రేషను కార్డులు, ధృవపత్రాలు, ఆస్తుల డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాలు, లబ్దిదారుల జాబితాలు వంటి వాటిని రుజువులుగా ఎన్.ఆర్.సి. సంస్థ ప్రకటించింది.

1951 నాటి ఎన్.ఆర్.సి. తయారీయే చాలా అరకొరగా, అపసవ్యంగా సాగింది. అధికారులు గ్రామానికి వెళ్ళి ఆ రోజు అందుబాటులో వున్న వారి పేర్లను రాసుకొచ్చారు. ఆనాటికి ప్రభుత్వానికి తగిన యంత్రాంగం లేదు. సిబ్బందికి తగిన శిక్షణ, నైపుణ్యం లేవు. పౌరసత్వ జాబితా ప్రాముఖ్యం మీద అవగాహన లేదు. దాంతో ఆదివాసీల, తెగల, ముస్లిముల పేర్ల నమోదులో తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. తెగలు, కులాలు, ఉపకులాలు, ఇంటి పేర్లు చాలా గందరగోళంగా నమోదయ్యాయి. ముస్లిముల పేర్లలో వున్న సారూప్యతలు మరో సమస్యగా తయారయ్యాయి. 1951 నాటికి భారత్‌లోనే వున్నప్పటికీ ఆనాటి తమ కుటుంబాల గుర్తింపును ధృవీకరించుకోవడానికి లక్షల మంది పడ్డ అవస్థలు వర్ణనాతీతం. బ్రహ్మపుత్ర నదీ పరీవాహ ప్రాంతంలోని వందలాది గ్రామాలు తరచూ వరదల్లో చిక్కుకుపోతూ వుంటాయి. వాటి భౌగోళిక, నైసర్గిక స్వరూపం మారిపోతూ వుంటుంది. వరదల్లో వారి కొంపా గోడూ కొట్టుకుపోతుంటాయి. వారి వద్ద ఆధారపత్రాలు లేవు. ఓటర్ల జాబితాలు ఎంత తప్పుల తడకలుగా వుంటాయో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. 1951-1971 మధ్య ఓటర్ల జాబితాలలోని తమ తల్లిదండ్రుల పేర్లను, తమ పేర్లను సరిపోల్చలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అస్సాం ఉద్యమ నేపథ్యంలో స్థానిక అధికారులు కొన్ని పేర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగించారు.

చివరికి ఇదంతా ఒక అమానవీయ ప్రక్రియగా తయారయ్యింది. పౌరులే తమ తోటి పౌరులను అనుమానించే దుస్థితి ఏర్పడింది. కాగితాలు ఆధారాలు దొరక్క పౌరులు కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ, నేతల చుట్టూ తిరిగి తీవ్ర అవమానాల పాలయ్యారు. ఇంతటి పెను విషాదాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనలని దిగమింగి ప్రజలు ఎన్.ఆర్.సి. ప్రక్రియలో పాలు పంచుకున్నారు. తుది జాబితా అనంతరం కేవలం 19 లక్షల మంది తమ పౌరసత్వ గుర్తింపును రుజువు చేసుకునే ఆధార పత్రాలు చూపలేకపోయారు. చూపలేని వారిలో పూర్వ రాష్ట్రపతి ఫ్రకృద్దీన్ ఆలీ అహ్మద్ సమీప బంధువులున్నారు. ఒక పద్మశ్రీ అవార్డు గ్రహీత వున్నారు. భారతీయ సైన్యంలో 35 ఏళ్ళ పాటు విధులు నిర్వర్తించిన వారున్నారు. విదేశీయులు 50 లక్షల నుండి కోటి మంది వరకూ వుంటారన్న ఉద్యమకారుల ప్రచారం కట్టుకథ అని రుజువయ్యింది. విదేశీయులంతా ముస్లిములేనన్న హిందూ మతోన్మాదుల ప్రచారంలోని బండారం బట్టబయలు అయ్యింది. ఈ 19 లక్షల మందిలో అత్యధికులు హిందువులు కావడంతో బిజెపి నేతలు కంగుతిన్నారు. అనర్హులు జాబితాలో చేరిపోయారనీ, అర్హులకు చోటు దక్కలేదని కొత్త పల్లవి ప్రారంభించారు. తామే అధికారంలో వున్న రాష్ట్రంలో జరిగిన ఒక ప్రక్రియను బిజెపి నేతలు తిరస్కరించడం తమ రహస్య అజెండాను కొనసాగించడం కోసమేనని స్పష్టమవుతోంది.

మిగిలిన 19 లక్షలలో నాలుగైదు లక్షల మంది అసలు జీవించే లేరని కూడా అంటున్నారు. ఫారిన్ ట్రిబ్యునల్స్‌లో, న్యాయస్థానాల్లో తగిన రుజువులు చూపలేని వారి పరిస్థితి ఏమిటన్న అంశంపై ఎవరికీ స్పష్టత లేదు. అటువంటి వారి సంఖ్య ఎంత వున్నప్పటికీ వారు రాజ్యరహిత, పౌరసత్వ రహిత ప్రజలు అవుతారు. కేవలం పత్రాలు లేవన్న పేరుతో కొందరిని అటువంటి అనామక స్థితిలో వుంచడం ఏ నాగరిక సమాజానికీ తగని పని. ఫారిన్ ట్రిబ్యునళ్ళ ఏర్పాటులో చాలా లోటుపాట్లు వున్నాయనీ, పౌరసత్వాన్ని నిరాకరించడం విషయంలో ట్రిబ్యునళ్ళకు లక్ష్యాలను నిర్దేశిస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి. తమ సొంత పౌరుల పట్ల ఇటువంటి అమానుష చర్యలకు ప్రభుత్వమే పూనుకుంటే, అటువంటి అన్యాయంలో న్యాయవ్యవస్థ పాలు పంచుకుంటే వారికి దిక్కెవరు ?

పౌరసత్వం లేని వారి కోసం డిటెన్షన్ క్యాంపులు పెట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే మూడు వేల మందిని అటువంటి క్యాంపులలో వుంచారు. వారిలో పాతిక మంది ఇప్పటికే మానసిక ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడ్డారు. లక్షలాది మందిని డిటెన్షన్ క్యాంపులలో వుంచడం ఎంతవరకూ సాధ్యమన్న సందేహాలకు సమాధానం లేదు. నాజీల నిర్బంధ శిబిరాల అమానుష కాండను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం సముచితమే. బిజెపి ఈ సమస్యను మరింత జటిలం చేయడానికి యత్నిస్తున్నది. అస్సాంలో విఫలమయ్యిందని తానే విమర్శిస్తున్న ఎన్.ఆర్.సి. ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టాలని కోరుతున్నది. హిందూ మెజారిటీ వాదాన్ని మరింత బలంగా వ్యాప్తి చేయడానికి ఎన్.ఆర్.సి.ని ఒక ఆయుధంగా వినియోగించుకోవాలని చూస్తున్నది. ❑



# సామాజిక న్యాయానికి తపించిన అంబేద్కర్




**డా॥ పట్టా వెంకటేశ్వర్లు**
అర్థశాస్త్ర ఉపన్యాసకులు
భవన్స్ న్యూసైన్స్ కాలేజ్, హైదరాబాద్


డా॥ అంబేద్కర్ "ప్రజాసామ్యం అనేది కేవలం ప్రభుత్వం స్వరూపం మాత్రమే కాదనీ, ఇది ప్రజల సమిష్టి జీవనానికి సంబంధించిన అనుభవాలతో పాటు, సాటి మనిషి పట్ల గౌరవంగా ప్రవర్తించటం అనే దాన్ని బట్టి ఉంటుంది. ఇలాంటి ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వంతో కూడిన మానవ సంబంధాలు సామాజిక, ఆర్థికరంగంలో నిర్మితం కాకపోయినట్లయితే రాజకీయ ప్రజాస్వామ్యం మనుగడ కొనసాగించలేదని" 1949లో రాజ్యాంగ ముసాయిదాను అంబేద్కర్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగంలో సామాజిక న్యాయాన్ని తీసుకురావాల్సిన అవసరాన్ని ఈ విధంగా అంబేద్కర్ చెబుతాడు. కాబట్టి ఈ లక్ష్యసాధనలో మన రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను, పార్లమెంట్ అమలుచేస్తున్నదా? ఇందువల్ల అత్యంత అణిచివేత పేదరికం అనుభవిస్తున్న దళితులు, గిరిజనులు జీవితాల్లో ఏ మేరకు సామాజిక న్యాయం అందుబాటులోకి వచ్చిందనే విషయాన్ని పరిశీలించాల్సి వుంది.

మన రాజ్యాంగంలోని చాలా ఆర్టికల్స్ గానీ, ఆదేశిక సూత్రాలు గాని చెప్పిందేమంటే, భారతీయ సమాజంలోని అసమానతలను నిర్మూలించి, సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని పెంపొందించమని నిర్దేశిస్తాయి. ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించే విధంగా వుండాలనీ అవి కోరుతాయి. అందుకు సంబంధించిన వివిధ అధికరణ పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. చట్టం ముందు అందరూ సమానులే (14వ అధికరణ) 15వ అధికరణ మతం, జాతి, కులం, లింగం, ప్రాంతాన్ని బట్టి వివక్షను పాటించడాన్ని నిషేధిస్తుంది. ఈ విధంగా మనుషులందరూ సమానమే అనే సూత్రాన్ని అమలుకు కోసం ఈ ఆర్టికల్స్ రచించారు. వీటికి కొనసాగింపుగా ప్రభుత్వ ఉద్యోగాలలో అందరికి సమాన అవకాశాలు (16వ అధికరణ) అంటరానితనం నిషేధం (17వ అధికరణ) మాట్లాడే హక్కు (19వ అధికరణ) పౌర రక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛా, పాలన హక్కులు (21వ అధికరణ) వెట్టిచాకిరీ, బలవంతపు చాకిరీ రద్దు (23వ అధికరణ) పద్నాలుగు ఏళ్ళలోపు పిల్లలను ప్రమాదకర పనుల్లో నియమించరాదు (24వ అధికరణ). ఇంకా పేదలకు సంబంధించి రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ప్రభుత్వ పాలనకు మార్గాన్ని నిర్దేశిస్తాయి.

38 అధికరణ, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాన్ని పెంపొందించటానికి ప్రభుత్వం పాటుపడాలని చెబుతాయి. అలాగే సమాన పనికి సమాన వేతనం స్త్రీ, పురుషులకు ఇవ్వాలి. పిల్లలు దోపిడీకి గురిచేయబడకుండా వారు ఆరోగ్యంగా అభివృద్ధి చెందేందుకు అవకాశాలు కల్పించాలి. 39(ఎ) అధికరణ కర్తవ్యం ఏమంటే అందరూ సమాన అవకాశాలు పొందటాన్కి న్యాయవ్యవస్థ పనిచేసే విధంగా ప్రభుత్వం చర్య తీసుకోవాలి. ప్రభుత్వం తన ఆర్థిక సామర్థ్యం, అభివృద్ధిని బట్టి పనిహక్కు, విద్యాహక్కు, నిరుద్యోగులకు ప్రభుత్వ సహాయం, వృద్ధాప్య పింఛన్లు, అంగవైకల్యం, జబ్బు పడినవారి అవసరాలు తీర్చాలని 41వ అధికరణ తెలుపుతున్నది. 42వ అధికరణ పని ప్రదేశాల దగ్గర చిన్నపిల్లల తల్లులకు సహాయాన్ని అందించాలి. 43వ అధికరణ ప్రకారం కార్మికుల జీవనానికి సరిపోయే వేతనాన్ని పొందే విధంగా రక్షణ కల్పించాలి. 45వ అధికరణ ప్రకారం 14 సం॥లోపు పిల్లలందరికి నిర్బంద ఉచిత ప్రాథమిక విద్య అందివ్వాలి. అలాగే 46వ అధికరణ నిర్దేశించేది ఏమంటే బలహీన తరగతులకు చెందిన వారి పిల్లలు విద్యాపరంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యేక రక్షణ చేపట్టాలని చెబుతుంది. ప్రత్యేకించి దళితులు, గిరిజనులను అన్ని రకాల అన్యాయాలు, దోపిడి నుండి రక్షించాలి. ప్రజలందరి పౌష్టికాహార స్థాయి, జీవన ప్రమాణాలు పెంచటం ప్రభుత్వ బాధ్యతని అధికరణ 47 చెపుతుంది. ఈ విధంగా చూసుకుంటుపోతే ఎన్నో ఆర్టికల్స్ పౌరుల సర్వతోముఖాభివృద్ధికి చేపట్టవల్సిన చర్యలన్నింటిని

వివరిస్తాయి. అందుకనే గ్రాన్విల్లీ ఆస్టిన్ అనే రాజ్యాంగ నిపుణుడు భారత రాజ్యాంగాన్ని ''ఒక సామాజిక పత్రం''గా ఉందని వ్యాఖ్యానిస్తాడు.

ఈ విధంగా డా॥అంబేద్కర్‌చే రూపొందించబడిన రాజ్యాంగం దళితులు, బలహీన వర్గాల ప్రజలకు అనుకూల సాధనంగా రూపొందించబడిందని అర్థం అవుతుంది. సమానత్వం, స్వేచ్ఛా, గౌరవప్రదమైన జీవనం, వివక్షతలు, సామాజిక, ఆర్థిక అన్యాయాలు, జీవించే హక్కు, పని హక్కు, జీవనానికి సరిపోయే వేతనం, దోపిడి నుండి రక్షణ వంటి అన్ని అంశాలు రాజ్యాంగంలో చేర్చబడ్డాయన్న మాట. ఒక మాటలో చెప్పాలంటే సమానత్వం కూడిన సమాజాన్ని ఆయన కాంక్షించాడు. ఇక డా॥అంబేద్కర్ దృష్టిలో దళిత మానవ హక్కులు రాజ్యం, న్యాయం ద్వారా గ్యారంటి చేయబడిన సహజ హక్కులుగా ఉన్నాయి.

మరుగుదొడ్లు అనేది మనుషుల గౌరవానికి సంబంధించిన ముఖ్యమైన అంశం. ఈ మరుగుదొడ్ల సమస్య కారణంగా మహిళలు లైంగిక దాడులతో పాటు హత్యలకు కూడా గురికావాల్సి వస్తుంది. ఇటీవలే ఉత్తరప్రదేశ్లో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. గిరిజనుల్లో నేటికి 77.4 శాతం మంది మరుగుదొడ్లు కలిగి లేరు. ఎస్సీల్లో అయితే 66.1 శాతం మందికి ఈ సౌకర్యం కలిగిలేరు. అదే ఇతర కులాల్లో అయితే 53.1 శాతం మందికి ఈ సౌకర్యం అందుబాటులో లేదు. అంటే దేశంలో దాదాపు సగం కంటే ఎక్కువ మందికి మరుగుదొడ్ల సౌకర్యం లేదన్నమాట. వీటన్నింటికీ మూల కారణం పేదరికం. ఇతర ఆరోగ్య విషయాలకు వస్తే, పేదరికం, పౌష్టికాహార సమస్య వల్ల మహిళలు, పిల్లలలో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంటుంది. గిరిజనుల్లో దాదాపు 70 శాతం (68.5) మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఎస్సీలు, ఇతర కులాలు కూడా 50 శాతంపైబడి ఈ సమస్యతో బాధపడుతున్నాయి.

వైపరీత్యమేమంటే ధనిక కుటుంబాల్లోని స్త్రీలు, కొద్దిస్థాయిలో పురుషులు కూడా ఈ సమస్యతో బాధపడుతున్నారు. దీనికి ఆహారం విషయంలో సరైన అవగాహన లేకపోవడంతో పాటు సంస్కృతి సంప్రదాయాలు ఒక కారణంగా తెలుస్తోంది. పిల్లల విషయంలో అన్ని కులాల పిల్లలు 70 శాతం పైబడి ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఎస్టీ పిల్లల్లో ఈ సమస్య 76.8 శాతంగా వుంటే ఎస్సీల్లో 72.2 శాతంగా ఉంది. ఇతర కులాల్లో అయితే దాదాపు 70 శాతం ఉంది. ఇక ప్రసూతి సౌకర్యాలు పరిశీలిస్తే, షెడ్యుల్ తెగలలో కేవలం 17.7 శాతం మంది మాత్రమే వ్యవస్థీకృత రంగంతో అందుబాటులో వుంది

అంటే దాదాపు 82.3 శాతం మంది ఇంటి దగ్గరే ప్రసవిస్తున్నారన్నమాట. ఈ స్థితి ప్రసూతి మరణాలు ఎక్కువగా జరిగేందుకు అవకాశం కల్పిస్తున్నది. అన్ని సామాజిక తరగతుల వారు కూడా వ్యవస్థీకృత రంగంలో ప్రసూతి సౌకర్యాలను 40 శాతం కూడా పొందటం లేదు. ఇది చాలా ప్రమాదకరమైన స్థితినే తెలియజేస్తుంది. శిశుమరణాల విషయాన్కి వస్తే ప్రతి 1000 జననాలకు 62 మరణాలు ఎస్టీలలో వున్నాయి. అయితే ఈ రకమైన మరణాలు ఎస్సీల్లో ఎక్కువగా ఉన్నాయి. ఇండియాలో సగటున ఇది 44 ఉంది. అదే కేరళలో అయితే కేవలం 12 శాతం మాత్రమే. ఇందుకు కేరళలో మహిళా అక్షరాస్యత ఎక్కువగా ఉండటం ఒక కారణం కావచ్చు. అక్షరాస్యత పెరగటం వల్ల అన్ని విషయాల్లో సానుకూల ప్రభావాన్ని చూపిస్తుంది.

సామాజిక అభివృద్ధికి కీలకమైనది విద్య. దీని ప్రభావం అనేక రకాలుగా ఉంటుంది. ఇవాళ కేరళ మానాభివృద్ధిలో నెంబర్ వన్గా ఉండడానికి విద్యరంగమే కారణం. కానీ మన దేశంలో విద్య విషయంలో అణగారిన కులాల పరిస్థితి హీనస్థాయిలోనే ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్టీ పురుషుల అక్షరాస్యత 59 శాతం కాగా, ఎస్టీ మహిళల అక్షరాస్యత కేవలం 33 శాతం మాత్రమే. అంటే 67 శాతం ఎస్టీ మహిళలు నిరాక్ష్యరాస్యు లన్నమాట. ఎస్సీల్లో పురుషులదీ 66 శాతం కాగా, స్త్రీలది 44 శాతం. అదే ఇతర కులాల్లో 70 శాతం పైబడి అక్షరాస్యత ఉంది. ఈ విషయాన్ని పరిశీలించినప్పుడు నిరాక్షరాస్యత, పేదరికం వంటి సమస్యలు అన్ని సమస్యలకు మూలధారంగా నిలుస్తూ, ప్రభావాన్ని చూపిస్తున్నట్లు తెలుస్తుంది.

కాబట్టి ఈ విశ్లేషణ తెలియజేస్తున్నదేమంటే అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం అనేక అధికరణల ద్వారా అణగారిన తరగతులకు సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు మార్గాల్ని సూచిస్తున్నప్పటికి, ఆ ప్రజల ఓట్ల ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు రాజ్యాంగం లక్ష్యాలను, నిర్దేశాలను పట్టించుకోకపోవడం వల్లే ఈ సాంఘిక వెలి కొనసాగుతున్నదని తెలుస్తున్నది. అందుకని డా॥అంబేద్కర్ చెప్పినట్లు ప్రజల్ని రాజకీయ విధాన నిర్ణయాలలో భాగస్వామ్యం పెరగనంతకాలం వారి జీవితాల్లో మెరుగైన ఫలితాలు కనబడవు. ❑

# మన తరం తుగ్లక్ కథలు మనమే రాసుకోవాలి



మందలపర్తి కిషోర్

దాదాపు వారం రోజుల కిందట బెంగళూరులో కన్ను మూసిన బహుముఖ ప్రజ్ఞావంతుడు గిరీష్ కార్నాడ్ ను ముఖ్యంగా ఒకందుకు పదేపదే జ్ఞాపకం చేసుకోవాలి. "తుగ్లక్" నాటకం రాయడం ద్వారా తన తరానికి చెందిన ఒక సామాజిక సమస్యను, చారిత్రక నేపథ్యంలో చూపించి, కళాకారుడిగా తన కర్తవ్యం నిర్వర్తించారు కార్నాడ్. ఆ పని చేసే నాటికి ఆయన వయసు కేవలం 27! జన సామాన్యంలో అత్యధికులకు అందుబాటులో ఉండే రచనా ప్రక్రియ, రూపకం. అదే ప్రక్రియలో కార్నాడ్ తన కర్తవ్యం నిర్వర్తించారు. 1965లోనే, నెహ్రూ పోయిన ఏడాదికే, కార్నాడ్ "తుగ్లక్" లాంటి నాటకం రాయడాన్ని నేను వ్యక్తిగత విజయంగా చూడను– ఆ తరానికి మొత్తానికి కాకపోయినా, అందులోని పాదరసం లాంటి మేధావి వర్గానికి చెందవలసిన విజయం అది! వాస్తవానికి అది ఒక చారిత్రిక పశ్చాత్తాప ప్రకటన పత్రం! ఆ నాటకంలో ఇతివృత్తం పద్నాలుగో శతాబ్దం నాటి ఢిల్లీ సుల్తాన్ కథ కాదు– పందొమ్మిది వందల అరవై దశకం నాటి భారత జాతీయ నాయకత్వం గురించిన కథ అది! ఆ విషయాన్ని కార్నాడ్ స్వయంగా చెప్పారు.

అయినా, కార్నాడ్ అనే సూర్యుడికి దివిటీ పట్టడం నా పని కాదు– కార్నాడ్ నుంచి, ఆయన సమకాలికులు ఎలాంటి ప్రభావం పొందారో చెప్పుకుంటే, అది కార్నాడ్ గురించి చెప్పుకున్నట్టే కదా! అలాంటి వాళ్లలో ముందుగా చెప్పుకోవలసింది "చో" రామసామి గురించి. చో ప్రముఖ నటుడు. పేరున్న రచయిత. సినిమాలూ, నాటకాలూ రెండింటిలోనూ ఎదురులేకుండా వెలిగిన ప్రయోక్త. తమిళ రాజకీయ రంగంలో చాణక్యుడిలాంటి వాడు. అన్నిటికీ మించి ప్రముఖ పత్రికా సంపాదకుడు. "తుగ్లక్" పేరుతోనే చో ఒక పత్రిక పెట్టి సమకాలీన రాజకీయ నాయకుల్ని తోలువొలిచేస్తూ రాసేవాడు. అలాంటి చో పైన కార్నాడ్ "తుగ్లక్" నాటకం ప్రభావం ప్రసరించడంలో వింతేముంది?

ప్రభావాలన్నీ ప్రతిఫలనాల మాదిరిగానే ఉండనక్కర్లేదు. సృజనాత్మకత ఉన్నవాళ్లు తలకిందులు ప్రపంచాన్ని, దాని కాళ్ళ మీద దాన్ని నిలబెట్టి, మనకు చూపిస్తారు. అదీ ప్రభావమే! కార్నాడ్ "తుగ్లక్" వెలువడిన మూడేళ్లకే, 1968 లో "చో" రామసామి తమిళంలో మరో "తుగ్లక్" నాటకం రూపొందించారు. ఈ నాటకం థియేటర్లలో నెలల తరబడి ఆడింది. మరో మూడేళ్ళకి, 1971 లో, ఇదే నాటకం చిన్నపాటి మార్పులతో తమిళ సినిమాగా వచ్చి దిగ్విజయం నమోదు చేసుకుంది. సహజంగానే, అది తెలుగులోకి దిగుమతికానూ అయింది!

నిజమే– "చో" రామసామి తమిళంలో రాసింది, కార్నాడ్ నాటకం లాంటిది కాదు. అందులో చారిత్రికతా– సమకాలీనతా– పెనవేసుకుపోవడం లాంటి అద్భుతాలు కనిపించవు. అయితే, నేరుగా ఆనాటి రాజకీయ నాయకుల మనస్తత్వాన్ని నడిబజారులో ఉతికి ఆరేశారు "చో". అసలు, కార్నాడ్ నాటకానికి, "చో" రామసామి నాటకానికి పోల్చడం కన్నా అసంబద్ధం మరొకటి ఉండదని నా అభిప్రాయం. అయినప్పటికీ ఓ మాట చెప్పాలనుకుంటున్నా– నా దృష్టిలో ఇవాళ్టి రాజకీయ వైపరీత్యం ఇతివృత్తంగా ఇలాంటి నాటకం ఇంకొకటి రావలసి వుంది!

పిచ్చి తుగ్లక్ తోలు నాణేలు ప్రవేశపెట్టి నవ్వుల పాలయ్యాడని చరిత్రలో చదువుకున్నాం. మన "నోట్లరద్దు" ప్రహసనం అంతకన్నా తీసిపోయిందా?


పిచ్చి తుగ్లక్ తన రాజ్యంలోని ప్రతి వ్యవస్థనూ – సంస్కరిస్తున్నాను అనుకుని – చిందరవందర చేశాడని చరిత్ర చెప్తోంది. మన దేశంలో ఇప్పుడు మాత్రం ఏం జరుగుతోంది? రిజర్వు బాంక్, ఎన్నికల సంఘం, కాగ్ తదితర వ్యవస్థలన్నీ ఛిద్రం అవుతున్నాయి మొర్రో అని కేజ్రీవాల్ మొదలుకుని మమతా బెనర్జీ దాకా మొత్తుకోవడం లేదా?

☞ మిగతా 31వ పేజీలో

# వేతనశర్మ కథ

రావిశాస్త్రి





పూర్వం ఒకానొక కాలంలో, మగధ దేశాన్ని సుందరసేనుడనే మహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు. (పాలించే వారే రాజు లనడం వేరు! రాజులే పరపాలించాలనడం వేరు) ఆ మహారాజు పంటల్లో నూటికి పదో వంతే ప్రజల నుంచి పన్నుగా స్వీకరిస్తూ, వర్ణాశ్రమ ధర్మాలను కాపాడుతూ, ప్రజలు మధ్య భగవంతుణ్ని నిలబెట్టి పోషిస్తూ, న్యాయంగా తనకి తోచిన రీతిని ఏలుబడి ఏల్తూ ఉండేవాడు.

ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్ములో, పరిపాలనా యంత్రాంగపు ఖర్చులు పోను ప్రజలకి సత్రవులు, వైద్యశాలలు మొదలైన వాటి ఖర్చులు పోను, సైన్యం ఖర్చులు పోను, రాణివాసపు ఖర్చులు పోను, విలాసాల గురించిన ఖర్చులు పోను, మూలధనం కింద ఏర్పాటుగా కొంత పోను, మిగతా సొమ్ముతో ఆ సుందరసేన మహీపతి కొన్ని కొన్ని దినుసులతో, వస్తువులతో లాభసాటిగా తను వ్యాపారం చేయించుకోవడమే గాక, తన బంధువులకీ, స్నేహితులకీ, జ్ఞాతులకీ, దన్నుదారులకీ చాలా మందికి ధర్మవడ్డీకి బదుళ్ళు ఇచ్చి, వారి వ్యాపారానికి సాయపడుతూ ఉండేవాడు. ఆ సహాయంతో ఆ బంధువులూ, స్నేహితులూ, జ్ఞాతులూ, దన్నుదార్లూ పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసుకొని విశేషంగా ధనం అర్జించి, మహీపతి వల్ల సాయం పొందుతూ, మహీపతికి సహాయం చేస్తూ, అక్కడక్కడ తాము కూడా ధర్మశాలలూ, దేవుడి గుళ్ళూ కట్టిస్తూ, ధర్మపాలనకీ, దైవపోషణకీ ఉడుతాభక్తిగా సాయం చేస్తూ, సుఖంగా, శాంతంగా, విలాసంగా, వినోదంగా జీవిస్తూ ఉండేవారు. వ్యాపారాల్లో లాభాలు ఎక్కువ రావాలన్నా, నష్టాలొచ్చినప్పుడు వాటిని భర్తీ చెయ్యాలన్నా ప్రజల మీద పన్నులు పెంచడం తప్ప మహారాజు గారికి మరో గత్యంతరం లేకపోతుండేది. నూటికి పదో వంతే పన్నుగా కొన్నాళ్ళ పాటు స్వీకరిస్తూ వచ్చిన రాజా వారు మరి కొన్నాళ్ళకి ఆ పన్నుల్ని నూటికి పాతిక పాలు దాకా పెంచవలసి వచ్చింది. అవసరాల కోసం రాజులు భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. ఆ భగవంతుడు ఆ అవసరాలన్నింటికీ వారికి వారి ప్రజల్నే చూపిస్తాడు.

ఆ కాలంలో మగధ దేశంలో, ఈ రోజుల్లో భారతదేశంలో లాగే నిరక్షరాస్యులు ఎక్కువ సంఖ్యలో ఉండేవారు. అజ్ఞానం ప్రజల్లో చాలా ఎక్కువగా ఉండేది. రాజు గారికీ, వారి బంధువులకీ, స్నేహితులకీ, ఆశ్రితులకీ అందరికీ లాభాలు ఎక్కువగా రావటంతో వారికి దాహం కూడా ఎక్కువ అయింది. మూలధనం ఎక్కువయితే వ్యాపారం ఎక్కువ చేసుకోవచ్చు. వ్యాపారం ఎక్కువయితే లాభాలు ఎక్కువ రాబట్టుకోవచ్చునని వారంతా బాగా తెలుసుకోవడంతో, ప్రజల మీద పన్నుల భారం పెరగడం జరిగింది. ప్రజలకి నడ్డి పూర్తిగా వంగడం జరిగింది.

కలిగిన వారు పన్నుల భారాన్ని కొంత సహించగలిగినప్పటికీ, చిన్న కుటుంబాల వారు మాత్రం చితికిపోసాగేరు. మరింక చిన్న వ్యవసాయదార్ల మాట చెప్పేనక్కర్లేదు. కూలినాలి జనం సంగతి ఎత్తేనక్కర్లేదు.

అయితే, ఈ రోజుల్లోలాగే ఆ కాలంలో కూడా కొద్ది మందే అయినప్పటికీ చదువుకున్నవారు కొంతమందైనా ఉంటూండేవారు. యంత్రాంగం నడవాలంటే, ఈ దినాల్లో ఉద్యోగస్థుల్లాగే ఆ దినాల్లో కూడా అటువంటి వారు ఉంటూండేవారు. వారిలో కరణాలనేవారు చాలా ముఖ్యులు.

పల్లెసీమల్లో పన్నులన్నీ వాళ్ళే వసూలు చేయింపిస్తూ లెక్కలన్నీ రాసి భద్రపరుస్తూ, వసూలు చేసిన సొమ్ము భటుల ద్వారా రాజధానికి పంపిస్తూ, ప్రభుత్వ యంత్రాంగంలో కీలక స్థానం ఆక్రమించుకొని ఉంటూండేవారు. ఆ కరణాలు అయితే వారు చిన్న జీతాలతో బతుకుతుండేవారు.

సుందరసేనుడు రాజ్యం చేసే కాలంలో మగధ దేశంలో ఓసారి క్షామ పరిస్థితి ఏర్పడింది. ఆ క్షామంలో చాలా మంది పేదలు పిట్టల్లా రాలిపోయేరు. అన్యాయాలు, అత్యాచారాలు చాలా ఎక్కువయేయి, రాజబంధువులంతా చాలా బాగుపడ్డారు.

ఆ దినాల్లో మార్కండేయుడనే ఋషిసత్తముడొకాయన ఉండేవాడు. మగధ మహారాజు, అతని అనుయాయులూ అంతా కలిసి ప్రజల్ని పీడించి దోచుకుతినడం ఆ మహర్షి చూసేడు. మహారాజూ, అతని అనుయాయులూ తెగిపోయి ప్రజలే రాజులైతే తప్ప ప్రజలు మరింక బాగుపడేది లేదని ఆ మహర్షి గ్రహించేడు. ''రాజునీ, అనుయాయుల్నీ పారదోలండి! మీ రాజ్యం మీరేలుకోండి! ఇది భగవదాదేశం!" అని ఆ మహర్షి ఆ దేశ ప్రజలకి బోధించసాగేడు. దానితో ప్రజానీకం రాజవర్గం మీద తిరుగుబాటు చేసింది. ఆ తిరుగుబాటులో అందరితో పాటు, చిన్న జీతాల మీద బతకలేకపోతున్న కరణాలు కూడా చేరేరు.

మార్కండేయ మహర్షి వాగ్ధాటికి, ఆయన లేవనెత్తిన ప్రజల ధాటికీ తట్టుకోలేని సుందరసేన మహారాజు తన వారితో సంప్రదించి ఓ పన్నాగం పన్నేడు. మార్కండేయుడు మహర్షిగా నటిస్తూ ఉన్నాడనీ, నిజంగా అతను అటువంటివాడు కాదనీ, అతను తుచ్ఛ కామవాంఛకి లోనై రాణివాసపు దాసిమనిషి అయిన ఒకామె చెల్లెల్ని బలాత్కారంగా చెరిచేడనీ ఆమె చేత అభియోగం చేయించి, తానే అదంతా విచారించి, మార్కండేయుడు ఋషి కాదనీ, దోషి అనీ తీర్పు చెప్పి మార్కండేయ మహర్షిని చిత్రహింసలు పెట్టి చంపించేడు సుందరసేనుడు.

ఆ వెంటనే, తిరుగుబాటుదార్లందర్నీ ఏ విచారణా అవసరం లేకుండా హింసించి చంపమని సుందరసేనుడు తన సైన్యానికి ఆజ్ఞ జారీ చేసేడు. తిరుగుబాటుదార్లనీ తమకు ఇష్టంలేనివారినీ కూడా సైనికులు వేటాడి చంపనారంభించేరు. వాళ్ళ ఆడవారిని సైనికులు బాహాటంగా చెరపనారంభించేరు. వాళ్ళ చిన్నపిల్లల్ని సయితం నరకనారంభించేరు. నేలంతా నెత్తురుమయమయింది. గాలంతా హాహాకారమయమయింది. రాజు గారి కత్తులకి భగవంతుడు కూడా భయపడ్డమయింది. ఆకాశం చేతకాని సాక్షిగా మిగిలిపోయింది.

మార్కండేయ మహర్షి లేవదీసిన తిరుగుబాటులో కరణాలు కూడా చేరేరని మనం తెలుసుకున్నాం కదా. ఆ కరణాలకి వేతనశర్మ అనేవాడు నాయకుడుగా ఉంటుండేవాడు. మహర్షిని మహారాజు గారు చంపించేసిన తరువాత, ప్రజల మీద రాజుగారి సైన్యం విరుచుకుపడ్డ తరవాత, ఆ సైన్యం అందర్నీ వేటాడినట్టే కరణాలని కూడా వేటాడనారంభించింది. కరణాలు చదువుకున్న వాళ్ళవడం చేత, చదువుకున్న గాడిద కొడుకులకి బుద్ధి చెప్తే మిగతావాళ్ళక్కూడా బుద్ధొస్తుందనే నమ్మకం వల్ల మహారాజు గారు కరణాలని మిగతా వారి కంటే కొంత ఎక్కువగా హింసించనారంభించేరు. తప్పు – హింసించసాగేరు.

ఆ పరిస్థితిలో, ఆ కరణాల నాయకుడైన వేతనశర్మ ఓ పగలూ, ఓ రాత్రీ కూర్చొని ఆత్మవిమర్శ చేసుకొని "నేనెవర్ని?" అని ప్రశ్నించుకొని "నేను కరణాన్నే కాని మరెవణ్ణీ కాను" అని ఖచ్చితంగా తేల్చుకొని, అందుపట్టి ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చి, తన కరణపు అనుయాయుల్ని పిల్చి, వారందరితో ఈవిధంగా చెప్పేడు.

"మార్కండేయుడు మంచివాడే కావచ్చు. మహర్షే అనొచ్చు. కాని, మానవుడికి బతుకు ముందు మంచి ఆ తరువాతానూ, బతకనివ్వని మంచితనంతో మనకి సంబంధం ఉండకూడదు. దాన్లో మనం సంబంధం పెట్టుకోకూడదు. అవును కద! మరైతే ఇంతకీ, మార్కండేయుడు చెప్పేదేమిటి?'' అని సూటిగా ప్రశ్నించేడు వేతనశర్మ.

కరణాలందరూ ముఖముఖాలు చూసుకున్నారు. ఏ ముఖంలోనూ సరైన సమాధానం కనిపించలేదు. అప్పుడు మార్కండేయుడి సిద్ధాంతం గురించి వేతనశర్మే వారికి నిజం తెలియజేసేడు. "మార్కండేయుడు మనకి చెప్పేది ఏమిటీ అంటే – అది ఇది ప్రజలు వేరు, రాజవర్గం వేరు. రాజవర్గం ప్రజల కష్టాన్ని దోపిడీ చేసి బతుకుతోంది. ఈ దోపిడీ వర్గం మీద తిరుగుబాటు చేసి, వారిని తరిమి పారేసి లేదా అణిచిపారేసి లేదా హతమార్చిపారేసి దోపిడీని రూపుమాపుతేనే ప్రజలు బాగుపడతారు తప్ప మరోవిధంగా ప్రజలు బాగుపడరు. అదీ మార్కండేయుడు మనకి చెప్పిన విషయం! ఏం? అంతేనా?" అని మరోసారి మరీ సూటిగా ప్రశ్నించేడు వేతనశర్మ తన కరణ జనాన్ని.

మార్కండేయ సిద్ధాంతాన్ని మంచినీళ్ళప్రాయంగా "మన" వేతన శర్మ తెలియజెప్పగలిగినందుకు కరణ జనం సంతోషించింది.

మార్కండేయ సిద్ధాంతం అంతేనని కరణజనం అంతా ఒప్పుకున్న తరువాత కరణకుల తిలకుడైన ఆ వేతనశర్మ ఇంకా ఇలా చెప్పుకుపోసాగాడు?

"మార్కండేయుడు తన సిద్ధాంతాన్ని ప్రజలకి చెప్పి నచ్చచెప్పడంతో చాలా మంది రాజవర్గం మీద తిరుగుబాటు చేసేరు. మనం కూడా కొంత కొంతగా ఇంత వరకూ ప్రజలకి సాయం చేస్తూ వస్తున్నాం. అయితే, తిరుగుబాటుదార్లని మన రాజవర్గం నిర్దాక్షిణ్యంగా, విచారణైనా జరపకుండా ఎంత క్రూరంగా భీభత్సంగా నరికిపారేసి అణిచిపారేస్తుందో మనం కళ్ళారా చూస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితుల్లో మనం ఏ చాటునో ఓ చాటున కూర్చొని ఒక్క విషయం ఆలోచించాలి".

"ఏ విషయం గురించి మనం చాటుగా కూర్చొని ఆలోచించాలి?" అని కరణాలంతా అడిగేలోపున వేతనశర్మ ఈ విధంగా చెప్పసాగేడు.

"ఈ దోపిడీ అనేది ఉండడం వల్ల మనకి ఏం నష్టం ఉంది? ఈ దోపిడీ నశిస్తే మనకి ఏమి లాభం చేకూరుతుంది? ఒకే విషయాన్ని ఈ విధంగా రెండు వైపుల్నించీ చూసినట్లయితే నాకు కనిపించేదేమిటంటే – ఎవరి దగ్గరైనా దోచుకొందికి ఏదైనా ఉంటేనే దాన్ని ఇతరులు దోపిడీ చెయ్యడం జరుగుతుంది. పంటలు పండించేవాళ్ళూ, సంపద సృష్టించేవాళ్ళూ ఎవరూ అంటే వాళ్ళు కర్షకులూ, కార్మికులూను. దోచుకొందికి ఏమైనా ఉంటే వాళ్ళ దగ్గరే ఉంటుంది. రాజవర్గం వాళ్ళనే దోస్తుంది. మనం పంటలు పండించేవాళ్ళమీ కాదు; సంపద సృష్టించే వాళ్ళమీ కాదు. అయితే మనం ఏ వర్గం? మన పనేమిటి? అని ప్రశ్నించుకుంటే, మనం కరణాలం, మనం మహారాజుగారు చేసే దోపిడీకి సహాయపడుతూ దోపిడీని దగ్గరుండి రాజుగారికి చేయించి పెడుతున్నాం. అంటే, మనం దోపిడీకి సహాయం చేస్తున్నాం అన్నమాట. అలా సహాయం చేస్తే మనకి మహారాజు ఇచ్చేదేమిటి? జీతం! మహారాజు వారు చేసే దోపిడీలు వారికి వసూళ్ళు చేసిపెట్టి లెక్కలు రాసి పెడుతున్నందుకు వారు మనకి జీతాలు ఇస్తున్నారు. అయితే మనం మార్కండేయుడి మాటలు విని వాడితో ఎందుకు చేరేం? రాజుగారు మనకి సరైన జీతాలు ఇవ్వకపోవడం వల్ల చేరేం. మనకి ఈ రాజ సమాజంలో జీతాలు పెరిగినట్లయితే మనకి ఏ ఇబ్బందైనా ఉంటుందా?" అని ప్రశ్నించేడు కరణ కులతిలకుడు.

రాజుగారు జీతాలు పెంచితే మనకి ఏ ఇబ్బందీ ఉండదు. ఉండదని ముక్తకంఠంతో సమాధానం చెప్పింది కరణ జనం.

అప్పుడు వేతనశర్మ తన గంభీరోపన్యాసాన్ని ఇంకా ముందుకి పోనిచ్చేడు. ప్రస్తుతం ఉంటున్న రాజ సమాజంలో మనకి వేతనాలు పెరిగి కొన్ని సదుపాయాలు కలిగినట్లయితే మనకి ఏ ఇబ్బందీ ఉండదని మనం తెలుసుకున్నాం. అయితే, ఈ దోపిడీ రాజ్యం నశించిపోయి, ప్రజారాజ్యం వచ్చిందనే అనుకుందాం, ప్రజారాజ్యం వచ్చినట్లయితే మాత్రం మనకి వచ్చేదేముంది? వేతనాలు పెరగవచ్చు. సదుపాయాలు కలగవచ్చు. కాని అప్పుడైనా మనకి దక్కేది అంతే కదా. అయితే దక్కేది అంతే అయినప్పుడు ఆపాటిదానికి మనం తిరుగుబాటులో చేరడం ఎందుకు? చిత్రహింసలకి పాలవడం ఎందుకు? చివరికి ఆస్తిపాస్తుల్నీ, ఆలుబిడ్డల్నీ అన్నీ, అందర్నీ పోగొట్టుకొని మెడకాయ మీద తలకాయ లేకుండా ఎగర గొట్టించుకోడం ఎందుకు? ఏ మనిషయినా, సంఘమైనా తనకి కావలసినదేమిటో తెలుసుకొని మరీ వ్యవహరించాలి. మనకి కావలసినవి జీతాలూ, సదుపాయాలూను, అవి ఉన్నట్లయితే మనం తప్పక బాగుపడతాం. సమాజం పూర్తిగా మారితేనే కాని జీవితాలు బాగుపడని వాళ్ళు చాలా మంది ఉన్నారు. వాళ్ళు విప్లవాలు తెస్తారు. చావుకి తెగిస్తారు. మనం ఆ కోవకి చెందుతామా? చెందం.

సమాజం ఇలానే ఉన్నప్పటికీ మనకి బాగుపడే అవకాశాలున్నాయి. అందుచేత, మనం ఈ తిరుగుబాటులో చేరి చావవలసిన అవసరం లేదు. రాజుల్నీ, రాజ్యాంగాల్నీ మారుస్తాం అంటే ప్రభువర్గం ఒప్పుకోదు. ప్రభువులకి కత్తి బలం, కండ బలం, డబ్బు బలం, గుండె బలం అన్నీ ఉన్నాయి. దాన్తో వాళ్ళు లక్షలక్షలు దోపిడీ చేస్తున్నారు. నిజమే! కాని మనం సాయం పూర్తిగా ఉంటేనే ఇది పూర్తిగా జరుగుతుంది. అటువంటప్పుడు ఆ లక్షల బంగారపు రాసులన్నీ వాళ్ళు ఉంచుకొని మనకి నాలుగు రాగిడబ్బులు పారేస్తే వాళ్ళకి నష్టం ఏముంది? ఇప్పుడు వారు మనకి పిడికెడు గింజలే ఇస్తున్నారు. మనం మరో నాలుగు పిడికెళ్ళమగుదాం. వారు మనకి మరొక అరపిడికెడైనా ఇవ్వకపోరు. మనకి వేతనాలు పెరిగితే రాజులూ మారనవసరం

లేదు. రాజ్యాంగమూ మారనవసరం లేదు. మమ్మల్ని మీరు పెంచండి. మిమ్మల్ని మేం దించం అని ప్రభువులతో చెప్పినట్లయితే వారు నమ్ముతారని నాకు నమ్మకం ఉంది. అందులోనూ, రాజవర్గానికి చావా బతుకా అని ఉన్నట్టి ఈ విప్లవ సమయంలో, మనం రాజవర్గానికి స్పష్టంగా "మాకు వేతనాలతోనే సంబంధం ఉంది, కాని విప్లవాలతో సంబంధం లేదు" అని చెప్పినట్లయితే వారు చాలా సంతోషించి మనకి మరో అర పిడికెడే కాదు, మరో పిడికెడైనా ఇచ్చి తీరుతారని నాకు ఎంతో నమ్మకం ఉంది. అందుచేత మీరందరూ నాకు ఆసరా ఇచ్చినట్లయితే నేను మన మేలు గురించి ప్రభువులతో సంప్రదిస్తాను. ఏమంటారు?" అని ముగించాడు వేతనశర్మ.

వేతన శర్మోపన్యాసం వింటోన్న కరణాల కళ్ళన్నీ జ్ఞాన కిరణాలతో మెరిసిపోయేయి. ఆనంద భాష్పాలతో నిండిపోయేయి. వారి అవసరాలన్నీ సంఘంలో వారి స్థాయినీ, జీవితంలో వారు సాధించుకోవలసిన లక్ష్యాలనీ వేతన శర్మ అంతా స్పష్టంగా వారికి తెలియజేసినందుకు వారంతా చాలా మురిసిపోయేరు.

రాగా పోగా, మహారాజా వారితో మంతనాలాడి రమ్మని ఆ కరణ జనం వేతనశర్మని దీవించి పంపించేరు. వేతనశర్మ రాజవర్గంతో చేసిన సంప్రదింపులు సఫలం అయేయి. కరణాలకీ, సుంకర్లకీ, బారికలకీ, భటులకీ అందరికీ చిటికెడు చిటికెడు చొప్పున జీతాలు పెరిగేయి. కొందరికి చిన్న చిన్న మాన్యాలు కూడా లభించేయి. మరొక ముఖ్య విషయం ఏమిటంటే, ప్రభుత్వోద్యోగులంతా ప్రభువు నుంచి జీతాలు తీసుకోవడమే కాకుండా, వారికి ప్రజల నుండి పారితోషికాలు కూడా పొందే హక్కు కలదని ఆనాటి నుండి గుర్తింపబడింది. వేతనశర్మ సాధించిన ఘన విజయాల్లో అది చాలా ఘన విజయం.

మరైతే, మార్కండేయుడు లేవదీసిన విప్లవం ఏమయింది? అది రాజవర్గపు కత్తులకి ఎంత మటుకు ఎరయింది? వేతన శర్మలు పొడిచిన వెన్నుపోటుకి చాలా మట్టుకు గాయపడింది. మిగతాది అలసట తీర్చుకొని మరునాడెప్పుడో చిచ్చుగా మారడానికి వీలుగా అడవుల్లో తలదాచుకుంది.

ప్రభుత్వోద్యోగులకి వేతనశర్మే మొట్టమొదటి పీఠాధిపతి. ఆ తరువాత వేతనశర్మలే కార్మిక నాయకులుగా కూడా రూపొందడంతో ప్రభువులంతా సకల ధన కనక వస్తు వాహనాలతో తులతూగుతూ ప్రశాంతంగా జీవించుకు వస్తున్నారు. ఎక్కువ జీతాల కోసం సమ్మెలే తప్ప, సమసమాజం కోసం విప్లవాలు వద్దంటారు ప్రభువులు. అవునంటారు ప్రభుత్వోద్యోగులు. ❑

**తొలి ప్రచురణ : ఆంధ్రజ్యోతి వారపత్రిక 25-05-1971**

**పుస్తక రూపం : బాకీ కథలు సంకలనం : ఉపాధ్యాయ, 2004**

---

## పుట్టుకే కాదు బతుకులోనూ నిష్ఠాపరుడు

**(5వ పేజీ తరువాయి)**

రచన ఆయనకు ఉద్యోగం కాదు. వృత్తికీ పరిమితమైన వ్యవహారం కాదు. పత్రికా రచన ఆయనకు ఓ దీక్ష. అలా భావించడానికి కమ్యూనిస్టు పార్టీ ప్రభావం ప్రధానమైంది. పార్టీ అప్పగించిన పనిని దీక్షతో నిర్వర్తించడం ఆయన ప్రవృత్తిగా మారింది. దాదాపు 61 ఏళ్ల వయసులో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కావాలనుకుంటే ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం సంపాదకుడిగా కొనసాగగలిగే వాడు. నిజానికి కమ్యూనిస్టు పార్టీ కోరికా అదే. ఒకే పత్రికకు అంతకాలం సంపాదకుడిగా పని చేసిన వ్యక్తి ఆయనొక్కడే. ఇది ఆయనొక్కడికే సాధ్యమైన రికార్డు.

రాఘవాచారి సంపాదకుడే కాని వర్తమాన కాలంలోని సంపాదకుల్లాగా సంపాదన దృష్టి ఉన్నవారు కాదు. అదే ఉంటే ఆయన సవ్యమైన మార్గంలోనే సరిపడినంత సంపాదించగలిగే వారు. కాని దీక్షాపరుడైనందు వల్ల ఆ మార్గాన్ని ఎన్నుకోలేదు. సంపాదకుడిగా ఆయన అనుసరించిన పద్ధతులూ ప్రమాణాలు ఎవరికైనా ఆదర్శప్రాయమైనవే. ఆ ప్రమాణాలు ఆచరించడం ప్రస్తుత తరుణంలో సాధ్యమూ కాకపోవచ్చు. అంత నిష్ఠ ఉన్న పత్రికా రచయితలూ లేకపోవచ్చు.

తొలితరం తెలుగు పత్రికా రచయితలలో సి.వై. చింతామణి, కోటం రాజు రామారావు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, మానికొండ చలపతిరావు, తెలుగు వారు ఇంగ్లీషు పత్రికా రచనలో విజయ పతాకం ఎగురవేశారు. రాఘవాచారి ఇంగ్లీషు పత్రికా రంగంలోనే కొనసాగితే వారికన్నా ఒక్క మెట్టు కూడా తక్కువ ఉండేవారు కాదు. జాతీయ స్థాయిలో కీర్తి సంపాదించేవారు. ఆ అవకాశం ఆయనకు లేకుండా పోయింది. నేటి తరం, భవిష్యత్ తరాల వారు నేర్చుకోవలసింది వచ్చిన అవకాశాలను ఆయన వినియోగించుకుని ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన తీరే. ఆయన నిష్ఠ నేర్పే పాఠం అదే. ❑

# బూర్జువా సమాజంలో డబ్బుకు ఉండే శక్తి

## 1844 నాటి అర్థశాస్త్ర, తత్వశాస్త్ర రాతప్రతుల నుండి

— కార్ల్ మార్క్స్

మనుషుల మనోభావాలూ ఉద్వేగాలూ వగైరాలన్నీ పరిమితార్థంలో కేవలం మానవశాస్త్ర సంబంధమయిన విషయాలే కాక, అవి నిజంగానే మానవ సారానికి సంబంధించిన అస్తిత్వ శాస్త్ర (యాంటాలజీ) అంశాలే అనుకోండి. మనిషి ఇంద్రియ జ్ఞానం కలిగిన (ప్రాకృతిక) అస్తిత్వం కావడం చేత, ఈ మనోభావాలూ ఉద్వేగాలూ నిజంగా ప్రకటితమయితే గనక, ఈ కింది విషయాలు స్పష్టమవుతాయి.

1. మనుషుల మనోభావాలూ ఉద్వేగాలూ వగైరాలను నిర్ధారించేందుకు ఒకే సాధనం ఉందనుకోవడానికి వీల్లేదు. వాటి ఉనికికి – జీవానికి సంబంధించిన విశేషమైన స్వభావం, వాటి విశిష్ట ప్రకటన రీతిపైన ఆధారపడి రూపొందుతుంది. దాని ఉనికి ఏ పద్ధతిలో ప్రకటితమవుతుందో, అదే వాటి నుంచి లభించే ఆనందానుభూతి యొక్క స్వభావ సిద్ధమైన రీతి.
2. ఒక వస్తువు యొక్క స్వతంత్ర అస్తిత్వానికి ప్రత్యక్ష తిరస్కరణగా ఇంద్రియానుభూతి – తినడం, తాగడం, వస్తువును తీర్చిదిద్దడం లాంటి రూపాల్లో వ్యక్తమయిన ప్రతి సందర్భంలోనూ, ఆ ప్రకటనే దాని అస్తిత్వ రూపం.
3. మనిషి, అతగాడి మనోభావాలు, మానవ స్వభావం కలిగి వుంటాయి. ఎదుటివాళ్లకు అవి ఎలా వ్యక్తమయితే అదే అతని సొంత అనుభూతి కూడా అలాగే వుంటుంది.
4. అభివృద్ధి చెందిన పారిశ్రామిక రంగం ద్వారా మాత్రమే– సొంత ఆస్తి సంధానం ద్వారా మాత్రమే ప్రగాఢమయిన మానవ మనోభావం తాలూకు అస్తిత్వ శాస్త్ర సారం సంపూర్ణ, మానవతా ప్రపూరిత రూపంలో ఉనికిలోకి వస్తుంది. అంచేత మానవ శాస్త్రం అనేది మనిషి యొక్క వాస్తవ కార్యాచరణ లోంచే పుట్టుకొస్తుంది.
5. సొంత ఆస్తి అంటే అర్థమేమిటంటే, మనిషికి అవసరమయ్యే ప్రధాన వస్తువుల అస్తిత్వమే. మానవ వియోగాన్ని పక్కనపెడితే, అటు ఆనందానుభూతులను అందించేవి, ఇటు కార్యాచరణకు కావలసినవీ అయిన వస్తువుల ఉనికే సొంత ఆస్తి.

దేన్నయినా సరే కొనుగోలు చేయగల ఆస్తిని ఆర్జించుకోవడం ద్వారా, సకల వస్తువుల సొమ్ములనూ బలవంతంగా గుంజుకోగలగడం ద్వారా, డబ్బు సమర్థవంతమైన సముపార్జనకు సారంగా నిలిచి వుంటుంది. సార్వజనీకమైన దాని ఆస్తి రూపమే, డబ్బును సర్వశక్తివంతమైన అస్తిత్వంగా మారుస్తోంది. పర్యవసానంగా, అది సాక్షాత్తూ భగవంతుడిగా వ్యవహరిస్తోంది. మనిషి అవసరాలకూ, వాటిని తీర్చగల వనరులకూ మధ్య తార్పుడుగాడిగా వ్యవహరిస్తుంది డబ్బు. అతగాడి జీవితానికీ, జీవన సాధనాలకూ మధ్యవర్తిత్వం వహిస్తుంది డబ్బు. నాకూ నా జీవనానికీ మధ్యవర్తిత్వం వహించే డబ్బే, ఇతరుల అస్తిత్వానికీ నాకూ మధ్యన సైతం మధ్యవర్తిత్వం నెరపుతుంది. నాకు సంబంధించినంత వరకూ అదే వేరే వ్యక్తి అస్తిత్వం.

*''ఎందుకు నీకీ చిందర వందర గందరగోళం, ఓ భయ్యా?*
*నీదే తలకాయ్, వీపూ నీదే, కాళ్ళూచేతులు నీవయ్యా!*
*బతుకులోని తియతీయని తేనియ ఎపుడో పీల్చేశామప్పా–*
*అది మా సొంతం అయిపోయిందని అన్నామంటే మా తప్పా?*
*జవమూ జీవం ఉన్న అరడజను జవనాశ్వాలవి నా సొత్తు*
*వాటిలోని ఆ సారం, సత్తువ, గాలికి ఎగిరే గుత్తపు జూలూ*
*వడిగా ఉరుకులు పరుగులు తీసే ఒకటి తక్కువగ పాతిక కాళ్లూ*
*నావేనంటూ స్వారీ చేస్తూ, ఆవేగంగా దూసుకుపోతా!''*

(గెటే : ఫాస్ట్ : మెఫిస్టోఫిలిస్)

'టిమోన్ ఆఫ్ ఏథెన్స్' నాటకంలో షేక్స్‌పియర్ ఏమన్నాడో చూడండి.

*పసిమి, మిసిమితో మెరిసే మేలిమి బంగారమా?*
*వద్దు వద్దు భగవాన్, నే సోమరి పూజార్ని కాను !*
*కొల్లలుగా పసిడి కూడినప్పుడు నలుపే తెలుపయి*
*అందవికారం తాను అతిసుందరమయిపోదా ?*
*తప్పులు తమంత తామే ఒప్పులుగా మారిపోయి*
*అల్పుడు ఘనుడయిపోగా భీరువు ధీరుడు కాడా ?*

అంతెందుకూ, ప్రభూ పసిడి ఎంతయినా చమత్కారి !
నీ అర్చక మహాశయుల నీకే దూరం చేయును
బలవంతుల పీఠాలను బహునేర్పుగ మార్చగలదు
పసిమి వన్నె బానిస ఏ మతాన్నయిన చీల్చగలదు –
అంతే అలవోకగ ఏ మతాన్నయిన కూర్చగలదు,
శాపగ్రస్థులనే వర ప్రసాదులుగ మార్చగలదు !
కుష్ఠు వ్యాధి పీడితుడగు మూడుకాళ్ల ముదుసలికే
ప్రియురాలిని కొనితెచ్చే పస పసిడికి ఉంది ప్రభూ !
గజదొంగల పాదాలకు గండపెండెరాలు తొడిగి
పదవులున్న పెద్దలచే ప్రశంసలూ పొగడ్తలూ
ఇప్పించే గొప్పదనం బంగారపు కుప్పకుంది !
ఆసుపత్రి మంచమెక్కి ఒళ్లంతా కుళ్లిపోయి
పుళ్లుపడిన ఒంటిమీద పులుముతుంది చందనాన్ని;
ఆకు రాలు కాలంలో ఆమని చిగురింపచేసి
వయసుడిగిన వితంతువుకు వరులను కొనితెచ్చు పసిడి !
వర్ధిల్లు వర్ధిల్లవె ఈ దౌర్భాగ్యపు మేదినీ
మానవాళికంతటికీ మూకుమ్మడి జారిణీ
జాతుల విధ్వంసానికి దారితీయు స్వైరిణీ !
అదే నాటకంలో, షేక్స్‌పియర్ ఇంకా ఏమన్నాడో చూడండి
ముద్దొచ్చే ముద్దరాల, కనువిందగు కన్నెపిల్ల
తియతీయగ మహరాజుల దిగమింగే జవరాలా !
కన్న కలల పసిడిపంట, కడుపున పుట్టిన బిడ్డను
దొరబాబును చేసి ఇంటి కెడబాటును కల్పిస్తావ్
అనాఘ్రాత మతిపవిత్ర మయిన కన్నెమొగ్గల కిట
కాలుష్యం చీడపీడ కలిగించే కాలనేమి !
వీరుల గుండెల్లోనే విశ్రమించు అంగారక,
జంకూ గొంకూ ఎరగని సమరాంగణ చక్రవర్తి !
అనుక్షణ నవీన మోహిని, అందరి వలపుల కామిని
అతిసున్నితమయిన రీతినితరుల కవ్వించగలవు !
నువు సిగ్గుల మొగ్గయితే, బుగ్గల కెంపులు పూస్తే
మునిముచ్చుల మంచుగుండె కరిగి, నీరు కాబోదా ?
వేటవేల్పు ఒడిలోనే సేదదీరు సుందరాంగి,
కళ్లముందు నడయాడే, కనిపించే దైవానివి
ముద్దులలో పరస్పరం ముంచెత్తే రీతిలోన
అసాధ్యాల నొక్కటిగా అతకగల్గు దివ్యాత్మా !
నాలికపై ప్రతి భాషా నాట్యమాడుతుంది నీకు
శాసనమై నీ మాటే సాగించును పనులన్నీ
గుండెల్లో మార్మోగే గుంజనమే నీ నామం !
నీ బానిస, మనిషిప్పుడు తిరగబడే ముప్పున్నది
అయోమయం సుడిలోపల అతగాడిని ముంచివెయ్యి;
కోరలు చాచిన మృగాల పాలనలో ఈ లోకం
కలకాలం వర్ధిల్లే కట్టుబాటు చెయ్యవమ్మ !

డబ్బు నైజం ఏమిటో, దాని వాస్తవ ప్రవృత్తి ఏమిటో షేక్స్‌పియర్ అద్భుతంగా చిత్రించాడు. ఆయన్ని అర్థం చేసుకునే క్రమాన్ని, ముందు గ్వెథే కవితకు వివరణతో మొదలుపెడదాం. డబ్బు ద్వారా, నాకేది దక్కుతుందో అదే – నేను దేన్నయితే డబ్బుతో కొనగలనో అదే – నా యొక్క, సదరు డబ్బు సొంతదారు యొక్క అస్తిత్వం. నా దగ్గరున్న డబ్బుకు ఉండే శక్తి సామర్థ్యాల పరిధే నా శక్తి సామర్థ్యాల పరిధి కూడా. డబ్బుకు ఉండే గుణగణాలే, నా– అంటే, ఆ డబ్బు సొంతదారు–గుణగణాలూ, అవే నా ప్రధాన శక్తి సామర్థ్యాలూ కూడా. నేనేమిటి, నా శక్తి సామర్థ్యాలేమిటి అనే వాటిని నిర్ణయించేది నా వ్యక్తిత్వం ఎంత మాత్రం కాదు. నేను అందవికారంగా ఉన్నా, అత్యంత సుందరమయిన స్త్రీని కొనుక్కోగలను. అంటే, నేను అందవికారిని కానట్లే కదా. ఎందుకంటే, అందవికారంగా ఉండడం వల్ల నాకు ఆటంకంగా ఉండే వాటిని నా డబ్బు తుడిచిపెట్టేసింది. నేను కాళ్లు లేని అవిటివాణ్ణి. కానీ, డబ్బు నాకు రెండు డజన్ల కాళ్లను – ఆరు గుర్రాలను సమకూర్చిపెట్టింది. అంచేత, నేను అవిటివాణ్ణి కాకుండా పోయాను. నేను చెడ్డవాణ్ణి, నిజాయితీ లేనివాణ్ణి, నీతినియమాలు లేనివాణ్ణి, మూర్ఖుణ్ణి – కానీ, డబ్బుకు గౌరవాదరాలు పుష్కలంగా దక్కుతాయి. దాన్ని కలిగినవాళ్లకు సైతం అవి పుష్కలంగానే దక్కుతాయి. డబ్బే అతి గొప్ప సుగుణం. దాన్ని కలిగి వున్నవాడే గొప్ప గుణవంతుడు. నేను అవినీతిపరుడిని కావలసిన దురవస్థ రాకుండా, డబ్బు నన్ను కాపాడుతుంది. దాంతో నేను నిజాయితీపరుడిగా గుర్తింపు పొందుతాను. నేను మూర్ఖుణ్ణే అయినప్పటికీ, డబ్బే అన్నింటినీ మించిన నిజమైన తెలివి. దాన్ని కలిగి వున్నవాడు మూర్ఖుడెలా అవుతాడు మరి? పైపెచ్చు, ఉన్నవాడు డబ్బుతో, ప్రతిభావంతుల సేవలను తన కోసం కొనుగోలు చేయగలడు. ప్రతిభావంతుల మీద పెత్తనం చెలాయించేవాడు, వారిని మించిన ప్రతిభామూర్తి కాకుండా ఎలా పోతాడు? మనిషి మనసు ముచ్చటపడి కోరుకునే వాటినన్నింటినీ కొనుగోలు చెయ్యగల సామర్థ్యం ఉన్న నేను సకల మానవ

సామర్థ్యాలనూ కలిగి వున్నట్లే కదా? నా అసమర్ధతలన్నింటినీ, నా దగ్గరున్న డబ్బు సామర్థ్యంగా మార్చలేదా మరి ?

నన్ను మానవ జీవితానికి ముడివేసేది డబ్బే అయితే – సమాజానికీ నాకూ బంధం కలిపే డబ్బు – నన్ను అటు ప్రకృతితోనూ ఇటు మనుషులతోనూ ముడేసే డబ్బు – బంధాలన్నింటినీ ముడివేసే బాంధవ్యమవునా కాదా? అది అన్ని సంబంధాలనూ కలపనూ గలదు. తెంచనూ గలదు. అంచేత అది వియోగానికి సార్వజనిక ప్రతినిధి అవుతుందా కాదా? అది నిజానికి సార్వజనిక వియోగ ప్రతినిధి కావడంతో పాటుగా, అదే బాంధవ్యాలను కలిపే సార్వజనిక ప్రతినిధిగా కూడా సమాజం యొక్క (సార్వజనిక) విద్యుత్ రసాయనిక శక్తిగా కూడా వ్యవహరిస్తుంది.

షేక్స్‌పియర్ డబ్బు గుణగణాల్లో రెండింటి గురించి ప్రత్యేకంగా నొక్కి చెప్పాడు.

1. డబ్బును మూర్తీభవించిన దైవత్వంగా కొలుస్తున్నారు. సకల మానవ, ప్రాకృతిక గుణగణాలూ డబ్బు పుణ్యామాని పూర్తిగా వ్యతిరేకమైన లక్షణాలు సంతరించుకుంటున్నాయి. అది సార్వజనిక విభ్రమంగానూ, సకల పరిణామాలనీ తలకిందులు చేసే శక్తిగానూ తయారయింది. అసాధ్యమైన పొత్తులను సుసాధ్యం చేస్తోంది.

2. భిన్న జాతులకూ ప్రజలందరికీ డబ్బు ఉమ్మడి వేశ్యగానూ, ఉమ్మడి తార్పుడు తొత్తుగానూ వ్యవహరిస్తోంది.

సకల మానవ, ప్రాకృతిక లక్షణాలన్నింటినీ గందరగోళపరచి, తలకిందులు చెయ్యగల శక్తి, అసాధ్యమైన పొత్తులను సుసాధ్యం చేయగల శక్తి – డబ్బుకు ఉండే దివ్య శక్తి – ఎక్కణ్ణుంచి వస్తోంది? మనుషుల వియోగ కారణం కావడం నుంచి, పరాయీకరణ నుంచి, ఆత్మను తాకట్టు పెట్టుకోవడమనే జాతిపరమయిన ప్రవృత్తి నుంచే డబ్బుకు ఈ శక్తిసామర్థ్యాలు సంక్రమిస్తున్నాయి. డబ్బు అనేది మనుషుల పరాయీకృత సామర్థ్యం.

ఒక మనిషిగా నేను చెయ్యలేని పనుల్ని, నా ప్రధాన శక్తి సామర్థ్యాలన్నీ కలిసినా చెయ్యలేకపోయే పనుల్ని, డబ్బు ద్వారా చెయ్యగలుగుతున్నాను. తద్వారా, డబ్బు ఈ శక్తులన్నింటినీ వాటి వాటి వాస్తవ స్వభావాలకు భిన్నంగా, విరుద్ధంగా మారుస్తోంది.

ఫలానా వంటకం కావాలని నాకు అనిపించిందనుకోండి లేదా నాకు నడిచే ఓపిక లేనందువల్ల బండిలో వెళ్లాలనుకున్నాననుకోండి. డబ్బు నాకు ఆ రెండింటినీ అందుబాటులోకి తీసుకొస్తుంది. నా ఊహజగత్తులో కోరికలుగా ఉన్న వాటిని, నా ఆలోచనలను కేంద్రకంగా ఉన్న వాటిని, నా కల్పనలను, వాటి కాంక్షిత అస్తిత్వాన్ని ఇంద్రియానుభూతులుగా, వాస్తవ అస్తిత్వాలుగా మారుస్తుంది డబ్బు. ఊహను జీవిత వాస్తవంగా, కల్పితమయిన ఉనికిని వాస్తవ అస్తిత్వంగా మారుస్తుంది డబ్బు. ఈ విధంగా కల్పనకూ వాస్తవానికీ మధ్యవర్తిత్వం నెరపడం ద్వారా డబ్బు నిజమైన సృజనశక్తిగా మారుతుంది.

డబ్బులేని వాడికి కూడా గిరాకీ వుంటుందనడంలో సందేహం లేదు. కానీ, నాలాంటి మూడో మనిషికీ ఇతరులకూ ఆ గిరాకీ కేవలం ఊహాత్మకమయిన, ఏ ప్రభావమూ అస్తిత్వమూ లేని విషయమే అవుతుంది. అంటే అది నాకు సంబంధించినంత వరకూ అవాస్తవమూ, అస్తిత్వ రహితమూను. డబ్బుతో ముడిపడిన సార్ధకమయిన గిరాకీకీ – అందుకు భిన్నంగా కేవలం నా అవసరాలపైనా, ప్రగాఢమైన మనోభావాలపైనా, కోరికలపైనా ఆధారపడిన గిరాకీకీ – మధ్యన తేడా, అస్తిత్వానికీ, ఆలోచనకూ మధ్యన ఉంటే తేడా లాంటిదే. కేవలం నా మనసులో ఊహగా ఉండే దానికీ, నా ఉనికికి ఆవల ఉండే వాస్తవ అస్తిత్వానికీ ఉండే తేడా లాంటిదే అది.

బండిలో ప్రయాణించేందుకు నా దగ్గర డబ్బు లేదనుకోండి. అప్పుడు నాకంటూ, వాస్తవరూపం తీసుకునే అవకాశమున్న ఓ అవసరమూ ఉండదు. నాకు చదువుకోవడానికి అర్హత ఉన్నప్పటికీ, అందుకు కావలసిన డబ్బు లేదనుకోండి. నాకు సార్ధకమయిన, నిజమైన అర్హత లేదనే అర్ధం. మరోవైపు – నాకు చదువుకోవడానికి అర్హత లేకపోయినా, తగినంత డబ్బుండి, కోరిక కూడా ఉందనుకోండి – అప్పుడు నాకు సార్ధకమయిన అర్హత ఉన్నట్లే. ఒక భావాన్ని వాస్తవంగానూ, వాస్తవాన్ని కేవల భావనగానూ మార్చే క్రమంలో – వెలుపలి, ఉమ్మడి మాధ్యమంగానూ, గుణంగానూ పనిచేస్తుంది డబ్బు. (మానవమాత్రుడిగా మనిషి నుంచి, మానవ సమాజంగా సమాజం నుంచి పుట్టుకు రానిదే వెలుపలి మాధ్యమం) మనిషిలోనూ, ప్రకృతిలోనూ ఉండే నిజమైన ప్రధాన శక్తి సామర్థ్యాలను కేవలం అనిర్దిష్ట అహంభావంగా అంటే, లోపంగానూ, పిచ్చి భ్రమగానూ మార్చి పారేస్తుంది డబ్బు. మరోవైపు కేవలం వ్యక్తుల ఊహల్లోనే పుట్టుకొచ్చిన సిసలైన

లోపాలనూ, పిచ్చి భ్రమలనూ, అసమర్ధతలనూ, ఇదే డబ్బు నిజమైన శక్తిసామర్థ్యాలు గానూ సుగుణాలుగాను మారుస్తుంది.

ఈ ఒక్క లక్షణం కారణంగానే, డబ్బు వ్యక్తిత్వాలను తలకిందులు చెయ్యగల శక్తి అని తేలుతోంది. ఆయా వ్యక్తిత్వాలను వాటికి విరుద్ధమయినవాటిగా మార్చగలదు. వాటికి ఆపాదించిన గుణగణాలకు పూర్తి విరుద్ధమయిన వాటిని అంటగట్టనూ గలదు.

అటు వ్యక్తినీ, ఇటు సామాజిక సంబంధాలనూ – మానవ సారమంటే తామేనని చెప్పుకునే బంధాలను కూడా తలకిందులు చెయ్యగల శక్తి డబ్బు. విశ్వసనీయతను అవిశ్వాసంగానూ, ప్రేమను ద్వేషంగానూ, ద్వేషాన్ని ప్రేమగానూ, సుగుణాన్ని దుర్గుణంగానూ, దుర్గుణాన్ని సుగుణంగానూ, సేవకుడిని యజమానిగానూ, యజమానిని సేవకుడిగానూ, మూర్ఖత్వాన్ని మేధస్సుగానూ, మేధస్సును మూర్ఖత్వంగానూ మార్చగలదు డబ్బు.

విలువలకు సంబంధించినంత వరకూ, డబ్బే క్రియా శీలకమైన భావనగా ఉనికిలో ఉంది. అందుచేతనే అది అన్నింటినీ గందరగోళపరచి ప్రతి విషయాన్నీ తన ద్వారా వినిమయం చేస్తుంది. ఈ తలకిందులు ప్రపంచం యొక్క సార్వజనిక అస్తవ్యస్తత, సంక్లిష్టత డబ్బు రూపంలోనే ఉంది. ఆ మాటకొస్తే, సకల ప్రాకృతిక, మానవిక లక్షణాలన్నింటి అస్తవ్యస్తత, సంక్లిష్టత డబ్బు రూపంలోనే కనిపిస్తుంది.

ధైర్యసాహసాలను కొనుగోలు చెయ్యగల వ్యక్తే – స్వతహా పిరికి వాడైనప్పటికీ కూడా గొప్ప ధీరుడు కాగలుగుతాడు. నిర్దిష్టంగా ఫలానా గుణానికో, ఫలానా విషయానికో, ఫలానా ప్రధాన మానవ సామర్థ్యానికో బదులుగా డబ్బు మార్పిడి జరగదు. కానీ మనిషికీ, ప్రకృతికీ సంబంధించిన సకల వస్తు ప్రపంచానికీ మారుగా డబ్బు వినిమయం జరుగుతుంది. పరస్పర విరుద్ధమైన గుణగణాలతో సహా ఏ విషయాన్నయినా మరో విషయంతో మార్పిడి చెయ్యడం – అది కూడా (డబ్బు) ఉన్నవాడి దృష్టికోణం నుంచే – డబ్బుతో సాధ్యమే. అసాధ్యమైన సహజీవనాన్ని సుసాధ్యం చేయడమంటే అదే. వైరుధ్యాలు పరస్పరం పెనవేసుకునేలా చేస్తుంది డబ్బు.

మనిషిని మనిషిగానూ, ప్రకృతితో అతగాడి బంధాన్ని మానవ సంబంధంగానూ ఊహించుకోండి. అప్పుడు మీరు ప్రేమకు బదులుగా ప్రేమను మాత్రమే ఇవ్వగలరు. నమ్మకానికి మారుగా నమ్మకమే ఇవ్వగలరు. కళను ఆస్వాదించాలంటే, మీరు సంస్కారం కలిగిన కళా హృదయులయి వుండాలి. ఇతరులను ప్రభావితం చెయ్యాలని మీకుంటే, ముందు మీరు ప్రజలపై స్ఫూర్తిదాయకమైన, ప్రోత్సాహకరమైన ప్రభావం ప్రసరించగల వ్యక్తిత్వం కలిగి ఉండాలి. అటు మనిషికీ, ఇటు ప్రకృతికీ సంబంధించిన మీ బాంధవ్యాలన్నీ నిర్దిష్ట ప్రకటనలై వుండాలి. మీ వాస్తవ వ్యక్తిగత జీవితం తాలూకు ఆకాంక్షలకు అవే లక్ష్యాలయి వుండాలి. ఇతరుల్లో ప్రేమ పుట్టించలేని రీతిలో మీ ప్రేమ ప్రకటితమయిందనుకోండి. ప్రేమికుడిగా మీ జీవన ప్రకటన మీకు మిమ్మల్ని వలపింప చేసుకోలేకపోయిందను కోండి. అప్పుడు మీ ప్రేమ అసమర్ధం, విఫలమని దాని అర్థం, అదో దురదృష్టం.❑

---

## మోదీ పూసిన మలాము

**(8వ పేజీ తరువాయి)**

వర్తిస్తాయి. జమ్మూకశ్మీర్ రాజ్యాంగంలో అనేకానేక సవరణలు చేసింది కేంద్రం. అన్నింటికీ మించి రాష్ట్రపతి పాలన విధించే 356 నిబంధన కూడ జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశారు. గవర్నర్‌ను శాసనసభ ఎంపిక చేయాలన్న రాష్ట్ర రాజ్యాంగ నియమాన్ని నీరుగార్చి గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించాలన్న నియమాన్ని కూడా చాలా నిశ్శబ్దంగా అందరి ఆమోదంతో మార్చేశారు. నెహ్రూ పాలనలో 1954 ప్రెసిడెన్సియల్ ఆర్డర్ ద్వారా దాదాపు మొత్తం రాజ్యాంగాన్ని, కొన్ని వివాదాస్పద సవరణ చట్టాలతో సహా జమ్మూ కశ్మీర్‌కు వర్తింపచేశారు.

మిగిలిన అడుగూబొడుగూ నియమాలేవైనా ఉంటే మోదీ సర్కార్ వాటిని కూడా విస్తరించింది. ఇద్దరు ప్రధానులూ ఘోరాలు చేశారా, ఒకరిది ఘోర తప్పిదమా, మరొకరిది చరిత్రాత్మక విజయమా, ఎవరిదేది? ఎక్కువ రాజ్యాంగ నియమాలను కశ్మీర్‌కు వర్తింపచేసిన ప్రధాని ఎవరు అనే క్విజ్ పెడితే మోదీ గెలుస్తారా? షా నిలుస్తారా? మహావక్త, మంచి ప్రధానిగా పేరుతెచ్చుకున్న అటల్ బిహారీ వాజ్‌పేయీ కశ్మీరియత్, ఇన్సానియత్, జమ్హూరియత్ ద్వారా కశ్మీర్‌తో స్నేహ సౌహార్ద సంబంధాలు పెంచుకోవాలన్నారు. మరి నెహ్రూనే కాదు వాజ్‌పేయి కూడా ఘోరతప్పిదం చేసినట్టేనా? ❑

# ప్రపంచానికి మార్క్స్ ఇచ్చిన బహుమతులు

## కార్ల్‌మార్క్స్‌కు, ఒక అవిశ్వాసి కృతజ్ఞత




**అవిజిత్ పాఠక్**

సామాజిక శాస్త్ర ఆచార్యులు
జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ


కారల్ మార్క్స్ జయంతి అనగానే నాకొక లోపలి పిలుపు వినిపించింది. ఆ ఆధునిక యుగ ప్రవక్తను ఆవాహన చేసుకుని అంజలి ఘటించాలనిపించింది. మార్క్సిస్టు అంటే కొన్ని ఖచ్చితమైన మార్గదర్శకాలను పాటించి తీరడం, చారిత్రక భౌతికవాదాన్ని శేషరతుగా అంగీకరించడం, తప్పించుకోవడానికి వీలు లేని చారిత్రక సూత్రాలు వర్గ సంఘర్షణకి దారి తీసి సామాజిక మార్పు సంభవిస్తుందని విశ్వసించడం, ఏదో ఒక వామపక్ష రాజకీయ పార్టీలో కార్యకర్తగా ఉంటూ అన్ని రకాల సామ్యవాద దృక్పథాల్ని ఊహాస్వర్గాలుగా కొట్టి పారవేయడమే అయితే నేను మార్క్సిస్టును కాదు. అయినప్పటికీ ఆయన ఆలోచనా సముద్రంలోని చైతన్య తరంగాలు నా వంటి విద్యార్థుల్ని, సంచారుల్నీ మోహపరుస్తూనే ఉంటాయి. ఒక రాజనీతి అర్థశాస్త్రజ్ఞుడు మార్కెట్ వినిమయంలో సరుకు స్వభావం ఐంద్రజాలికంగా మారిపోయే రహస్యాన్ని విప్పుతున్నప్పుడూ ఒక రాజనీతి శాస్త్రవేత్త వర్గ నిర్మాణాన్నీ, రాజ్య స్వభావాన్నీ, సంఘర్షణాత్మక సమాజ గమనంలో అధికారం నిర్వహించే పాత్రను పరిశోధిస్తున్నప్పుడూ ఒక అస్తిత్వవాద తాత్వికుడు జార్జి విల్‌హెల్మ్ ఫ్రెడరిక్ హెగెల్‌తోనో, లుడ్విక్ ఫ్యూయర్‌బాక్‌తోనో మానవుడు పరాయీకరణలో జాతి స్వభావాన్ని (Species Character) కోల్పోవడం గురించి చర్చిస్తున్నప్పుడూ – మార్క్స్ సర్వత్రా పరివ్యాప్తమైనట్లుంటాడు. అందుకే సోవియట్ యూనియన్ పతనమై బెర్లిన్‌గోడ కూలిపోయి, నూతన ఉదారవాద పెట్టుబడి ప్రపంచీకరణ చెందుతున్న ఈ కాలంలో కూడా ఆయన్ని జ్ఞాపకం చేసుకోవడానికి సాహసిస్తున్నాను.

### మార్క్స్ ఇచ్చిన బహుమతి

ప్రపంచాన్ని చూడడంలోని మన దృక్పథాన్ని మార్చివేయడంలో కీలకపాత్ర వహించిన నాలుగు మార్క్సియన్ లోచూపుల్ని ప్రస్తావిస్తాను. వీటి ప్రభావం నుంచి మార్క్స్ వ్యతిరేకులు సైతం తప్పించుకోలేరనేది వాస్తవం. మొదటిది, పెట్టుబడిదారీ వ్యవస్థ మీద ఆయన చేసిన సాధికారికమైన నైతిక విమర్శ. యువ మార్క్స్ కాల్పనిక జగత్తు సృష్టిగా నేను దాన్ని కొట్టి పారవేయలేను. అందుకు భిన్నంగా సైద్ధాంతిక ఆచరణకు ఉన్న పరిధిని గుర్తిస్తాను.

అంతేకాదు, పరాయీకరణ, శ్రమ వినియోగం, దేన్నైనా తనకు వ్యతిరేకంగా మార్చుకోగల డబ్బు సామర్థ్యం మొదలైన అంశాల మీద హెగెల్ ప్రభావితుడైన మార్క్స్ ఆలోచనలు, కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలో ఆర్థిక తాత్విక వ్రాతప్రతుల్లో ప్రతిపాదించిన గణాంకాలు – పరిణితుడైన మార్క్స్ 'పెట్టుబడి'లో ప్రతిపాదించిన మానవ సంబంధాలన్నీ వస్తుసంబంధాలుగా మారిపోయే 'వస్తు ఆరాధన' – వీటన్నిటి మధ్య ఒక అసాధారణ బంధుత్వం కూడా ఉందంటాను. ఐపియల్‌లో గ్లోబల్ పెట్టుబడి, కార్పొరేట్ మీడియా, క్రికెట్, దృశ్య సంబరం తప్ప ఏం చూస్తున్నాం మనం ?

నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థ మనల్ని సరుకులుగా మార్చి, మనలోని జీవశక్తిని, సృజనాత్మకతను మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేస్తుంది. అందుకే మార్క్స్ సామ్యవాదం అనే ఉదాత్త స్వప్నాన్ని మనకిచ్చాడు. అది రూపానికీ సారానికీ మధ్య, స్వేచ్ఛకూ అవసరానికీ మధ్య, వస్తువుగా మారడానికీ మారకపోవడానికీ మధ్య తుల్యత సాధించి, ప్రేమ నుంచే ప్రేమ పుట్టడం గురించి, సంపూర్ణ మానవుడు అన్ని జీవన శాఖల్నీ తలదాల్చవలసిన అవసరం గురించి విశదం చేస్తుంది. శ్రమకాలం, అదనపు విలువ, లాభం వంటి అంశాల సైద్ధాంతీకరణల్లో పడి పై వాస్తవాన్ని విస్మరించడానికి వీలు లేదు. ఆర్థిక రాజనీతి మీద మార్క్స్ ఆలోచనల్లో కూడా ఈ సారాంశం ఇమిడి ఉంది.

రెండవది, మనకొక విమర్శనాత్మక చైతన్యాన్నివ్వడం ద్వారా ఆయన మన కళ్ళు తెరిపించాడు. ఆ శక్తి – మన సామాజిక వాతావరణంలో మన ఆలోచనల్ని ఎట్లా వర్తింప చేసుకోవాలో, ఉత్పత్తి శక్తులతో ఉత్పత్తి సంబంధాలతో మన సంబంధం ఏమిటో, ఏ పాలకవర్గమైతే ఉత్పత్తి సంబంధాలను నియంత్రిస్తుందో ఆ వర్గం ఎట్లా తననొక వివాదరహితమైన సత్యంగా లేక అందరూ ఆమోదించే భావనగా నిలబెట్టుకుంటుందో మనకు అర్థమయ్యేటట్లు చేస్తుంది. ఈ సైద్ధాంతిక భ్రమ లేదా అసత్య

చైతన్యం వలలో చిక్కకుండా మనం తప్పించుకోవాలి. నిజంగా సమాజం ఎట్లా పని చేస్తుందో చూడాలన్నా, వర్గ విభజిత సమాజంలో 'స్వచ్ఛమైన పోటీ' వాస్తవాల్ని ఎట్లా దాచిపెడుతుందో, ఎట్లా అధికారమూ, సంపద సమానంగా విభజించబడవో తెలుసుకోవాలన్నా ఈ అవగాహన తప్పదు. ఇది నిజానికి రాజ్యాన్ని పునర్నిర్వచించడం లాంటిది. రెండు వర్గాల మధ్య రాజ్యం కనపరచే మధ్యవర్తిత్వం అడుగున యధాతథ స్థితిని నిలబెట్టుకునే సైద్ధాంతిక, నిర్బంధ విధానాలు దాగి ఉంటాయి. ఒక రకంగా రాజ్యం చెప్పే (అ) సత్యాల ఆవలకి చూడగలిగే శక్తినివ్వడమే మార్క్స్ మనకు ఇచ్చిన బహుమతి.

మూడవది, సంఘర్షణకు కొత్త అర్థాన్ని ఇచ్చాడు మార్క్స్. సంఘర్షణ అపసవ్యం కాదు. శాంతిభద్రతల సమస్య కాదు, అదొక వ్యతిరేక భావన కానే కాదు. అందుకు భిన్నంగా అది సామాజిక, నిర్మాణ మూలాలలోనే పాతుకుని ఉంది. మార్క్స్ పదునెక్కిన గతి తార్కికవాదం చెబుతున్నట్లుగా సంఘర్షించే వర్గాల ప్రయోజనాలే చరిత్ర చోదకశక్తులుగా పనిచేశాయి. వాద, ప్రతివాదాల మధ్య నిరంతరం జరిగిన గతి తర్క పురోగమన విధానాన్ని చరిత్రను చూడడానికి ఒక పద్ధతిగా చేసుకున్నాం. నూతన ఉత్పత్తి విధానాలు పారిశ్రామిక బూర్జువా వర్గాల ఆవిర్భావానికి దారితీసి భూస్వామ్య వ్యవస్థను నేలమట్టం చెయ్యడాన్ని అర్థం చేసుకున్నాం. వలస భారత దేశంలో జాతీయ మధ్య తరగతి ఆవిర్భావం అఖిల భారత స్వాతంత్ర్యోద్యమానికి దారి తీయడాన్నీ, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ సరిహద్దు ప్రాంతాల ప్రజలు 'మావోయిస్టు విజృంభణ – బూటకపు ఎన్‌కౌంటర్‌లు' అనే విషవలయంలో పడి స్థానభ్రంశమై, అవమానకర అణచివేతకు గురై, అంచులకు నెట్టివేయబడడాన్ని ఈ కోణం నుంచే చూడగలుగుతున్నాం.

నాల్గవదీ, ఆఖరుది – మనిషి తన పరిధుల్నీ సాధ్యాల్ని గుర్తించగలగడంలో మార్క్స్ సహకరించాడు. భౌతిక ప్రపంచంలో స్వేచ్ఛ సంపూర్ణంగా ఉండదు. ఎందుకంటే సామాజిక ఆర్థిక నిర్మాణంలో అనేక నిరోధాల మధ్య చారిత్రకంగా నిర్దేశింపబడిన పాత్రను మనం పోషిస్తుంటాం. మార్క్స్ 'జర్మన్ ఐడియాలజీ'లో చెప్పినట్టు భావనలు, నైతికత, మతం మొదలైనవి స్వయం ప్రతిపత్తి కల్గినవి కావు. మనుషులు దేన్ని ఎట్లా ఉత్పత్తి చేస్తారో దానితో ఏకీభావం కలిగి ఉంటారు. అయినప్పటికీ మార్క్స్ భౌతికవాదం ఫ్యూయర్‌బాక్ భౌతికవాదం లాగా యాంత్రికమైనది కాదు. చైతన్యానికీ వాస్తవరూపం తీసుకోవడానికీ మధ్య ఆచరణ ఉంటుంది. ఈ ఆచరణ ద్వారానే ఒక సమూహంగా మన స్థానాన్ని పునరాక్రమించుకుంటాం. చారిత్రక విభాతసంధ్యల్లో మౌనప్రేక్షకుల్లా మిగిలిపోకుండా మన పాత్రను పోషిస్తాం. మార్క్స్ ఒక వెలుపలి వ్యక్తిగా ఇనుప సూత్రాలను చరిత్రకు ఆపాదించలేదు. గొప్ప భావావేశంతో మన చారిత్రక బాధ్యతను గుర్తు చేసిన ఆలోచనాశీలి ఆయన. ఫ్యూయర్‌బాక్ మీద చేసిన 11వ వాదంలో ఈ అంశం సమృద్ధిగా స్పష్టం చేయబడింది. అక్కడే ఆయన ఇలా అన్నాడు 'తత్త్వవేత్తలు ప్రపంచాన్ని వివిధ రకాలుగా వ్యాఖ్యానించారు. కానీ జరగవలసింది దాన్ని మార్చడం'.

మార్క్స్ మంత్రసమానమైన తన ఆలోచనా విధానంతో కళాకారుల్ని, రాజకీయ కార్యకర్తలను, విద్యావేత్తలను, తత్త్వవేత్తలను ఒకర్నేమిటీ, ఒకటేమిటీ జీవితంలోని అన్ని పార్శ్వాలను ఉత్తేజితం చేశాడనడంలో ఆశ్చర్యమేమీ లేదు. విభేదాలున్నప్పటికీ ఆయన్ని తప్పించుకుపోలేం. ఉదాహరణకు మాక్స్‌వెబర్ వంటి సామాజిక శాస్త్రవేత్త మరింత జాగ్రత్తతో కూడిన అధ్యయనంతో వర్గం, అంతస్తు, అధికారం వంటి సామాజిక అంతరాలను వెలికి తీసినప్పుడూ లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణంలో భావనలు నిర్వహించవలసిన పాత్రను అభ్యర్థించినపుడూ – వాటన్నిటి వెనుక 'మార్క్స్ భూతం' అతణ్ణి వెంటాడుతుంది. అట్లాగే భారతీయ మార్క్సిస్టు, అంబేద్కరిజమ్ ఇస్తున్న ఒత్తిడికి తలవొగ్గి కులాధిక్యతను సాపేక్షంగా అంగీకరించినా దాని అడుగున ఉన్న ఆర్థిక ప్రాతిపదికను పాక్షిక భూస్వామ్య వ్యవస్థలో భూమిపై ఉండే హక్కుల్లోని అంతరాలను విస్మరించలేడు. ఆ మాటకొస్తే జీన్‌పాల్‌సార్త్రె ప్రతిపాదించిన అస్తిత్వవాదం కూడా మార్క్స్ ఆత్మకూ మనస్సాక్షికీ పూర్తిగా భిన్నమైంది కాదు. నిజానికి సార్త్రె మనిషి తాను స్వతంత్రుడిని కాననే అపనమ్మకం (bad faith) గురించి వ్యక్తీకరించిన వేదన, మార్క్స్ పరాయీకరణ చెందిన మనిషి గురించి పడిన బాధ – మౌలికంగా వేరైనవి కావు. మార్క్సిస్టు మహా కథనాల మీద గాఢవిమర్శ చేసిన మిచెల్ ఫుకో కూడా సూక్ష్మ అధికార భౌతిక సూత్రాల చలనశీలతను ప్రస్ఫుటం చెయ్యడంలో మార్క్స్ విమర్శనా పద్ధతినే అనుసరించాడు.

## ప్రమాదాలు - సృజనాత్మకత - ప్రయోగాలు

ఏమైనప్పటికీ మార్క్సిజంలో మనం మరచిపోవడానికి వీల్లేని ఆర్థిక నియతివాదం, నియంతృత్వ హింస వంటి ప్రమాదాలు ఉన్నాయి. అదృష్టవశాత్తూ కొందరు సృజనశీలురైన సంప్రదాయ

వాదులు కాని మార్క్సిస్టులు మారుతున్న కాలానికనుగుణంగా విముక్తి చైతన్యాన్ని అన్వయించగలుగుతున్నారు. ఉదాహరణకు మార్క్సిజమ్‌ను సమాజాన్ని కురచపరిచే సిద్ధాంతంగా, మార్చడానికి వీల్లేని నియతివాదంగా, ప్రత్యక్ష అంశాలపైనే కానీ భావాత్మక అంశాలపై మాట్లాడని ఆలోచనగా దిగజార్చే అవకాశం ఉంది. నికోలాయ్ బుఖారిన్, జార్జి ప్లెఖనోవ్ వంటి వారి పై ధోరణులను తన బలమైన విమర్శ ద్వారా ఎదుర్కొన్నందుకు ఆంటోనియో గ్రాంషికి కృతజ్ఞతలు. బెనిడెట్టో క్రోస్ వంటి ఆదర్శ తత్త్వవేత్త సాంస్కృతిక రంగం పైన, మానవ సాధ్యాలపైన చూపిన సున్నితత్వాన్ని ఆధారం చేసుకుని గ్రాంషి 'ఆచరణ తాత్వికత' (Philosophy of Prayis) ను రూపొందించాడు.

నిజానికి చరిత్రను నడిపించే యాంత్రిక, నియతివాద సూత్రాలంటూ ఏమీ లేవు. రాజకీయాలు, సృజనాత్మక కార్యరంగం కాబట్టి, గ్రాంషి చెప్పినట్టు 'ఒకరు తన కార్యాచరణ మేరకే ముందుకు చూడగలుగుతారు'. గ్రాంషి వల్లనే మనం జనసమ్మత భావనకూ, మేధోజనిత ఆలోచనకు మధ్య సయోధ్యను సాధించాల్సిన అవసరాన్ని గుర్తించాం. సాంస్కృతిక రంగంలో ప్రత్యామ్నాయ ఆధిపత్య పోరాట ఆవశ్యకతనీ – యుద్ధ సంసిద్ధ స్థితికి (War of Position) యుద్ధోన్ముఖ కదలిక (War of movement) కీ మధ్య సున్నితమైన తుల్యతనీ గుర్తించాం. గ్రాంషి వల్లనే మార్క్సిజమ్ మానవీయ కోణాన్ని నిలుపుకోగలిగింది.

శాస్త్రీయంగా ఉండడం కూడా బరువును మోయడం వంటిదే. కారల్ మార్క్స్ కూడా న్యూటన్ సిద్ధాంతం, డార్విన్ పరిణామ వాదం వంటి తమకు తామే అడ్డంకులుగా మారిన శాస్త్ర నియతులను ప్రతిపాదించిన యూరోపియన్ వికాసదశకు పుట్టిన బిడ్డే. కానీ ఇరవయ్యో శతాబ్దపు సామాజిక వాస్తవం మారుతూ వచ్చింది. సైన్సు, ఆధిపత్య భావనగా మారి 'సాంకేతిక హింస'గా పరిణమించింది. గిడసబారిన సాంస్కృతిక ధోరణుల నుంచి ఫాసిస్టు మనస్తత్వం పెరిగింది. అడాల్ఫ్ హిట్లర్, బెనిటో ముస్సోలినీ, జోసఫ్ స్టాలిన్ వంటి నియంతలు ఆవిర్భవించారు. సంప్రదాయ మార్క్సిజమ్ ఇవ్వలేని కొత్త విశ్లేషణ కొత్త ఆలోచనా విధానమూ అవసరమయ్యాయి. ఇదుగో ఈ దశలోనే ఒక అద్భుతం జరిగింది. ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ తలెత్తి అర్థవంతమైన జ్ఞానాన్నిచ్చింది.


తియొడోర్ అడొర్నో సాంస్కృతిక పరిశ్రమను చదవడంలో పాతదారుల్ని చెరిపేశాడు. మార్క్యూజ్ 'ఒక్క కొలతే ఉన్న మానవుడు' నియంత్రణ లేకుండా సాగించే వినియోగం గురించి సామాజిక విశ్లేషణలు చేశాడు. ఫ్రాయిడ్ మార్క్స్‌లతో ఎరిక్ ఫ్రామ్‌కు ఉన్న సున్నిత అనుబంధం వల్ల అస్తిత్వం 'కలిగి ఉండడం' కన్నా అస్తిత్వ'మై' ఉండడం ఒక ఉత్సవంగా మారింది. సాంస్కృతిక రంగం మీద స్పృహ కల్గిన, చర్చించుకోగలిగిన సంపద్వంతమైన సంప్రదాయం మార్క్సిజమ్ నుంచే పుట్టగలిగింది. మన యం.యన్.రాయ్‌ని మనమే మరచిపోవడం ఎందుకు ? శ్రామిక నియంతృత్వంలో దాగి ఉన్న ఆధిపత్య బీజాలను ఆయన అప్పుడే చూపించాడు. రాయ్ రాడికల్ హ్యూమనిజాన్ని పార్టీరహిత ప్రజాస్వామ్య వికేంద్రీకరణల్ని ఎట్లా విస్మరిస్తాం? ఈ ప్రయోగాల వల్ల మార్క్సిజమ్ తన బహుళతత్వ సంప్రదాయాన్ని నిలుపుకుని తన 'అధికారిక' అభ్యాసకుల నుంచి తనను తానే రక్షించుకుందని నమ్ముతున్నాను.

మార్క్స్ నిజంగా ఒక ముఖ్యమైన మలుపు. ఆధునిక కాల లౌకిక మత స్థాపకుడు. కానీ రవీంద్రనాథ్‌ఠాగూర్, మహాత్మాగాంధీ వంటి వారు సాధించుకున్న లోతైన అనుభవమేదో ఆయన పొందలేకపోయాడు. ఠాగూర్ బహుశా అనగలిగిన 'కవి మతం' (Poet's religion) ను, అంటే గాఢమైన కృతజ్ఞత, ప్రార్థనల ద్వారా రససిద్ధినిచ్చే మతాన్ని, విశ్వలయతో మనల్ని సంధానపరచే మతాన్ని, వర్గ విశ్లేషణ వంటి నిర్దిష్ట విధానాలకు ఆవలి వైపు చూడగలిగిన దేన్నో మార్క్స్ జారవిడుచుకున్నాడు. అట్లాగే ఆయన గాంధీ 'లోపలి ప్రపంచంలోకి ప్రయాణం' వంటి భావనలకు, రాజకీయాల్ని ప్రేమతో, సర్వోదయ భావనతో మార్చడానికి కావలసిన ఆత్మక్షాళనకు గురి కాలేకపోయాడు. పాశ్చాత్య హేతువాద ధోరణుల్లో మునిగిపోయిన మార్క్స్ ఈ స్వాభావిక ఆత్మ సంగీతాన్ని వినలేకపోయాడు.

అయితేనేం, జీవితమిట్లానే ఉంటుంది. మనం నిరంతరం నేర్చుకుంటూ నేర్చుకున్నది వదిలేస్తూ మన ఆకాశాల్ని విస్తరించుకోవాలి. మనల్ని మనం తగినంత ప్రయోగాత్మకం చేసుకుంటూ మానవీయ మార్క్స్, కవితాత్మక ఠాగూర్, దార్శనికుడైన గాంధీలతో కలిసి ప్రయాణిస్తే భారతీయ రాజకీయ సాంస్కృతిక రంగాలు కల్లోలాల నుంచి బయటపడే దారి కనిపిస్తుంది. సామాజిక వైరుధ్యాలను కప్పి పుచ్చే సిద్ధాంతమైన తీవ్ర జాతీయవాదం నుంచి, అభివృద్ధి పేరుతో ఉగ్రంగా దూసుకెళుతున్న మొరటు ధోరణి నుంచి పేదరికాన్ని చుట్టుముట్టిన అసభ్య వైభవం నుంచీ నిరుద్యోగిత నుంచి, రాజకీయాలను బ్రాండెడ్ సరుకుగా విక్రయించే పబ్లిక్ మాయాజాలం నుంచి అప్పుడు మాత్రమే బయటపడగలం. ❑

## మన కోసం ఆనాడు

# కార్ల్ మార్క్స్ చేసిన ఐదు పనులు!



వారాంతంలో సరదాగా గడపడమంటే మీకిష్టమా? ప్రభుత్వ రోడ్లపై డ్రైవ్ చేస్తే ఎలా ఉంటుంది? లేదంటే ప్రభుత్వ లైబ్రరీకి వెళ్తే ఎలా ఉంటుంది?

అన్యాయం, అసమానత్వం, దోపిడీ అంతం కావాలని కోరుకునే వారిలో మీరూ ఉన్నారా?

మీ సమాధానం అవును అయితే, మీరూ ఈ మే 5న కార్ల్ మార్క్స్ 200వ జయంతిని జరుపుకోండి.

ఎందుకంటే ఈ సమస్యలపై మొట్టమొదట పోరాటం చేసింది కార్ల్ మార్క్సే.

మార్క్సిస్ట్ విప్లవ రాజకీయాలు చాలా ప్రత్యేకమైనవని 20వ శతాబ్దానికి చెందిన చాలా మంది భావిస్తారు.

సామాజిక న్యాయం, సమాజంలో తీసుకురావాల్సిన మార్పులకు మార్క్స్ ఆలోచనలు చాలా అనువైనవి. ఎంతో ప్రత్యేకమైనవి.

ఆ తర్వాత కాలంలో నిరంకుశత్వం, స్వాతంత్ర్యం లేకపోవడం, సామూహిక హత్యలు వంటివి ఆయన సిద్ధాంతాలతో ముడిపడటం తో వాటిని అనుమానంతో చూస్తున్న మాట కూడా వాస్తవమే.

అయితే ఆయన ఓ మానవతావాది, ఉన్నత లక్ష్యాలున్న నాయకుడు అన్నది నిర్వివాదం. ప్రపంచాన్ని మరింత సౌకర్యవంతంగా చేయడంలో ఆయన ఆలోచనలు, విధానాలు ఎంతో సహాయం చేశాయి.

కార్ల్ మార్క్స్ కొన్ని అంశాలను చక్కగా అంచనా వేశారు. కొద్ది మంది సంపన్నులు తెరపైకి వచ్చి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను శాసిస్తారని, పెట్టుబడిదారీ విధానం ప్రజలను గందరగోళానికి గురిచేస్తుందని, ఆర్థిక సంక్షోభాలు ప్రజలను దాదాపు చంపేసినంత పని చేస్తాయని ఆయన హెచ్చరించారు.

కార్ల్ మార్క్స్ మన కోసం ఇంకా ఏమేం చేశారో పూర్తిగా తెలుసుకోవాలంటే ఈ కథనం పూర్తిగా చదవండి. ఆయన్ను 21వ శతాబ్దంలో కూడా ప్రజలు ఎందుకు స్మరించుకోవాలో అర్థం అవుతుంది.

### 1. పిల్లలు పనిబాట కాదు బడిబాట పట్టాలి!

ఆధునిక ప్రపంచంలో దాదాపు అందరి ఆశ, ఆకాంక్ష ఇదే. పిల్లలు ప్రయోజకులు కావాలంటే విద్య ముఖ్యమని ఇప్పుడు ప్రపంచం గుర్తిస్తోంది. కానీ 1848లోనే కార్ల్ మార్క్స్ ఈ విషయం గుర్తించారు. పిల్లలు పలుగు, పార పట్టకూడదు. పలకా బలపం పట్టాలని ఆనాడే చెప్పారు. 'కమ్యూనిస్టు మేనిఫెస్టో' రాసేటపుడే బాల కార్మికులు ఉండరాదని ఆయన ఆకాంక్షించారు.

కానీ ఇప్పటికీ ప్రతి పది మంది బాలలలో ఒకరు కార్మికులుగానే ఉన్నారు. 2016లో అంతర్జాతీయ కార్మిక సంఘం చెప్పిన లెక్కలివి. అయితే, కార్ల్ మార్క్స్ పోరాటం వల్ల చాలా మంది చిన్నారులు ఫ్యాక్టరీల నుంచి పాఠశాల బాట పట్టారు. అది కార్ల్ మార్క్స్ చేసిన కృషే.

"ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలందరికీ విద్య, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అనేది కార్ల్ మార్క్స్, ఏంగెల్స్ కమ్యూనిస్ట్ మేనిఫెస్టోలోని పది పాయింట్లలో ఒకటి" అని 'గ్రేట్ ఎకనమిస్ట్స్: హౌ దెయిర్ ఐడియాస్ కెన్ హెల్ప్ అజ్ టుడే' పుస్తక రచయిత లిండా యూహ్ అన్నారు.

పిల్లలకు చదువుకునే హక్కు గురించి చెప్పిన వారిలో మార్క్స్, ఏంగెల్స్‌లే మొదటివారు కాదు. కానీ "ప్రాథమిక విద్య తప్పనిసరి అని 19వ శతాబ్దంలో వచ్చిన చైతన్యానికి మార్క్సిజం కూడా గొంతు కలిపింది. ప్రజల్లో వచ్చిన ఈ చైతన్యంతో చిన్నారులను ఫ్యాక్టరీల్లో పనికి పంపడం మానేశారు" అని లిండా చెప్పారు.

## 2. మీకు ఫ్రీ టైం ఉండాలి. దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో మీరే నిర్ణయించుకోవాలి.

ఇప్పుడు మీరు రోజుకు 24 గంటలు పనిచేయడం లేదు. వారంలో 7 రోజులూ ఫ్యాక్టరీకి / ఆఫీస్‌కి వెళ్లడం లేదు. డ్యూటీ మధ్యలో లంచ్ బ్రేక్ తీసుకోవచ్చు.

రిటైర్మెంట్ తర్వాత వృద్ధాప్యంలో పెన్షన్ అందుకునే వెసులుబాటు కూడా కొందరికి ఉంటుంది.

ఈ సౌకర్యాలు మీకు సంతృప్తిని కలిగిస్తున్నాయా? మీ సమాధానం అవును అయితే, మీరు తప్పకుండా కార్ల్ మార్క్స్‌కి కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

"రోజంతా పనిచేసేలా మీపై ఒత్తిడి తీసుకొస్తే ఇక మీకు వ్యక్తిగత సమయం అంటూ ఏదీ ఉండదు. నీ సొంత జీవితం కూడా నీ అదుపులో ఉండదు" అని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మైక్ సావేజ్ అన్నారు.

తమ వద్ద ఉన్న ఏకైక సంపదైన శ్రమను కార్మికులు డబ్బు కోసం అమ్ముకునేలా పెట్టుబడిదారీ వ్యవస్థ ఎలా ఒత్తిడి తీసుకొస్తుందో ఆనాడే మార్క్స్ రాశారు. పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడకు అది అవసరం.

కానీ ఇందులోనూ అసమానతలు ఉండేవి. మార్క్స్ ప్రకారం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఉండేది కాదు. శ్రమ దోపిడీ జరిగేది. కార్మికులను మనుషులుగానే చూసేవారు కాదు. ఇది వారిని ఎంతో బాధించేది. వారికి మరిన్ని సౌకర్యాలు కావాలని మార్క్స్ ఆకాంక్షించారు. మనం స్వతంత్రంగా, సృజనాత్మకంగా ఉండాలని భావించారు. అన్నింటి కంటే ముఖ్యంగా మన సమయాన్ని మనకిష్టమైనట్లు ఉపయోగించుకునే వీలు ఉండాలని ఆయన అనేవారు.

"పనే మన జీవితం కాకూడదు. మనకంటూ వ్యక్తిగత జీవితం కూడా ఉండాలి. మనకూ ఇష్టాయిష్టాలు ఉండాలి. జీవితంలో ఏం కావాలో మనమే నిర్ణయించుకోవాలి" అని మార్క్స్ చెప్పేవారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇదే భావన ఉందని ప్రొఫెసర్ మైక్ అన్నారు. ఈ భావనకు పురుడు పోసింది మాత్రం మార్క్సే.

## 3. చేసే పనిలో మీకు సంతృప్తి ఉండాలి!

కార్ల్ మార్క్స్ ఇదే కోరుకున్నారు. మీరు చేసే పనిలో మీకు సంతృప్తి ఉండాలని చెప్పారు. కార్మికులు చేసిన పనిలో తమను తాము చూసుకుంటారు.

పని చేసే వాతావరణం మనం మరింత సృజనాత్మకంగా ఉండేందుకు వీలు కల్పించాలి. మన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి, పదును పెట్టుకునేందుకు అవకాశం ఉండాలి. అది మానవత్వం కావొచ్చు, తెలివితేటలు కావొచ్చు.

"ఒకవేళ మీరు చేసే పని మీకు నచ్చకపోతే అది ఎంతో బాధగా ఉంటుంది. పనిపై దృష్టి పెట్టలేకపోతారు. శక్తిసామర్థ్యాలు ఉన్నా వాటిని సరిగా వినియోగించుకోలేకపోతారు. ఒక రకంగా కుంగిపోతారు. క్రమంగా సమాజానికి దూరమైపోయే ప్రమాదం ఉంది"

ఈ మాటలు ఏ సిలికాన్ వ్యాలీకో చెందిన మోటివేషనల్ గురూ ఇటీవల చెప్పినవేమీ కాదు. 19వ శతాబ్దంలోనే మార్క్స్ చెప్పిన సూక్తులివి.

మనిషి ఉన్నతమైన జీవితానికి ఉద్యోగ సంతృప్తి అవసరం అని ఆలోచించిన నాటి తత్వవేత్తల్లో కార్ల్ మార్క్స్ మొదటి వరుసలో ఉంటారు. 1844లో రాసిన "ఎకనామిక్ అండ్ ఫిలసాఫిక్ మాన్యుస్క్రిప్ట్స్" పుస్తకంలో మార్క్స్ ఈ విషయాలను ప్రస్తావించారు.

ఫ్యాక్టరీలు, కార్యాలయాల్లో మనం చాలా సమయం పని చేస్తూనే గడుపుతాం. ఆ పని నుంచి ఎంతో కొంత సంతోషం మనకు కలగాలి.

మీరు సృష్టించిన లేదా చేసిన పనిని చూసినప్పుడు మీకు గర్వంగా అనిపించాలి. అది మీకు ఉద్యోగంలో సంతృప్తి కలిగిస్తుంది. సంతృప్తి ఉంటే జీవితంలో సంతోషంగా ఉంటారు అని మార్క్స్ నమ్మేవారు.

క్షణాల్లో పని జరిగిపోవాలనుకునే పెట్టుబడిదారీ వ్యవస్థ.. ఉత్పత్తిని, లాభాలను ఎలా పెంచేసుకుందో కార్ల్ మార్క్స్ గమనించారు. ఈ ఉరుకులు పరుగుల కారణంగానే పని విభజన జరిగింది.

ఒక స్క్రూ మీద మూడు గీతలు గీయడమే మీరు చేయాల్సిన పని అనుకోండి.

అప్పుడు అదే పని గంటల తరబడి, రోజుల తరబడి, సంవత్సరాల తరబడి చేస్తే ఎలా ఉంటుంది? మీరు చేసే ఆ పనిలో ఆనందం పొందగలరా? అసాధ్యం కదా.

ఎంత సులువైన పని అయినా.. దాన్నే రోజుల తరబడి పదే పదే చేయడం కష్టంగా అనిపిస్తుంది.

## 4. మార్పుకు ప్రజలే ప్రతినిధులు!

సమాజంలో ఏదైనా తప్పు ఉంటే మీకు అన్యాయం, అసమానత్వం జరుగుతోందని భావిస్తారు. దాన్ని నిలదీస్తారు. నిరసన తెలుపుతారు. తప్పుడు దారిలో వెళ్తున్న సమాజాన్ని సరైన మార్గంలో పెట్టేందుకు ప్రయత్నిస్తారు.

19వ శతాబ్దంలో బ్రిటన్ కొత్త పెట్టుబడిదారీ వ్యవస్థ ఎటూ కదలకుండా మెదలకుండా ఉండే కార్మిక శక్తిని చూసి ఉంటుంది.

కానీ మార్పు వస్తుందని కార్ల్ మార్క్స్ నమ్మారు. మార్పు కోసం కార్మికులను ప్రోత్సహించారు. ఆ తర్వాత ఈ ఆలోచన సత్ఫలితాలిచ్చింది.

వ్యవస్థీకృత నిరసనలు, పోరాటాలు సమాజాన్ని సమగ్రంగా మార్చేందుకు ఎంతో దోహదం చేశాయి. ముఖ్యంగా జాతి వివక్ష వ్యతిరేక చట్టాలు, పేద, ధనిక వివక్ష వ్యతిరేక చట్టాలు రావడానికి కృషి చేశాయి.

"సమాజాన్ని మార్చాలంటే విప్లవం రావాలి. మెరుగైన సమాజం కోసం మేం ఉద్యమిస్తాం. మా పోరాటం ఫలితంగానే ఉద్యోగులకు జాతీయ ఆరోగ్య పథకం వచ్చింది. రోజుకు 8 గంటల పని విధానం అమల్లోకి వచ్చింది" అని లండన్‌లో మార్క్సిజం ఉత్సవాన్ని నిర్వహించిన వారిలో ఒకరైన లూయిస్ నిల్సన్ అన్నారు.

మార్క్స్‌ను అందరూ ఒక తత్వవేత్తగా అభివర్ణిస్తారు. కానీ లూయిస్ నిల్సన్ దాన్ని అంగీకరించరు. "మార్క్స్‌ను తత్వవేత్త అంటే కేవలం సిద్ధాంతాలు రాసిన వ్యక్తిగానే ఆయన కనిపిస్తారు. కానీ కార్ల్ మార్క్స్‌లో ఒక ఉద్యమకారుడు ఉన్నారు. కార్మికుల కోసం పోరాటం చేసిన నాయకుడున్నారు. అంతర్జాతీయ కార్మికుల సంస్థను ఏర్పాటు చేశారు" అని నిల్సన్ అంటారు.

కార్ల్ మార్క్స్ ఇచ్చిన "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" నినాదం నిజంగా ఒక ఆయుధం లాంటిది.

మెరుగైన జీవితం కోసం నిరంతరం పోరాటం చేయడమనే సంప్రదాయం మార్క్స్ నుంచి మనకొచ్చిన నిజమైన వారసత్వం.

మార్పు కోసం ఉద్యమిస్తున్న వాళ్లు తాము మార్క్సిస్టులమని చెప్పుకున్నా, చెప్పుకోలేకపోయినా అది మార్క్సిజం సిద్ధాంతంపైనే ఆధారపడి ఉంటుందని నిల్సన్ చెప్పారు. మహిళలకు ఓటు హక్కు ఎలా వచ్చిందని ప్రశ్నించారు నిల్సన్.

పార్లమెంట్‌లో ఉన్న పురుషులు జాలిపడి మహిళలకు ఓటు హక్కు కల్పించలేదు. పోరాటం, ఉద్యమం ఫలితంగానే మహిళలకు ఆ హక్కు వచ్చింది. వారాంతపు సెలవు మనకెలా వచ్చింది? కార్మిక సంఘాలు సమ్మె చేసినప్పుడు యాజమాన్యాలు దిగిరాక తప్పలేదు. మరి, సాధారణ ప్రజల జీవితాలు మెరుగుపడాలంటే మనమేం చేయాలి?

సామాజిక మార్పు కోసం మార్క్సిజం ఒక ఇంజన్‌లా పనిచేస్తోంది. దీనికి ఎంతో పట్టుంది. "వాళ్లు కోరుకుంటున్న సంస్కరణలు తప్పకుండా వారికి ఇచ్చేయాలి. లేదంటే వారు మనకు విప్లవాన్ని పరిచయం చేస్తారు" అని 1943లో బ్రిటన్ రాజకీయ నాయకుడు క్విన్టిన్‌హాగ్ అంగీకరించారు.

## 5. ప్రభుత్వం గురించి మార్క్స్ హెచ్చరించారు.. మీడియా మీద ఓ కన్నేసి ఉంచాలన్నారు.

ప్రభుత్వం - కార్పొరేట్ కంపెనీల మధ్య సన్నిహిత సంబంధాలు ఉంటే మీకు ఎలా అనిపిస్తుంది?

చైనాకు గూగుల్ దొడ్డిదారికి ఇచ్చిందని తెలిస్తే అది మీకు అసౌకర్యంగా అనిపిస్తుందా?

ఓటర్ల మనోభావాలను ప్రభావితం చేసే వ్యవస్థలను సృష్టించే కంపెనీలకు ఫేస్‌బుక్ తన యూజర్ల వ్యక్తిగత వివరాలను అందిస్తే ఎలా ఉంటుంది?

19వ శతాబ్దంలో మార్క్స్, ఏంగెల్స్ సరిగ్గా ఇలాంటి అభ్యంతరాలనే లేవనెత్తారు. కానీ ఆనాడు వాళ్లేమీ సోషల్ మీడియాలో చురుగ్గా లేరు! కానీ ఈ ప్రమాదాన్ని చాలా ముందుగా పసిగట్టి, దాన్ని విశ్లేషించిన మొదటి వాళ్లు మార్క్స్, ఏంగెల్స్‌లేనని బ్యూనస్ఎయిర్స్ యూనివర్శిటీ ప్రొఫెసర్ వాలేరియా వెగ్ వీస్ చెప్పారు.

వాళ్లు (మార్క్స్, ఏంగెల్స్) ఆ కాలంలో ప్రభుత్వం, బ్యాంకులు, వ్యాపార కంపెనీలు, ఏజెంట్ల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలను అధ్యయనం చేశారు. దీనిపై పరిశోధన చేస్తూ 15వ శతాబ్దం నాటి పరిస్థితులనూ విశ్లేషించారని వాలేరియా తెలిపారు.

సుదీర్ఘ అధ్యయనం తర్వాత వారొక నిర్ణయానికి వచ్చారు. ఆ ప్రక్రియ మంచిదైనా, చెడ్డదైనా అది ప్రభుత్వానికో లేదంటే వ్యాపార సంస్థకో ప్రయోజనం చేకూర్చేలా ఉందని తేల్చారు.

మీడియానూ కార్ల్ మార్క్స్ సునిశితంగా పరిశీలించారు. ప్రజల అభిప్రాయాన్ని ప్రభావితం చేసే విషయంలో మీడియా ప్రాముఖ్యాన్ని మార్క్స్ అర్థం చేసుకున్నారు.

ఇప్పుడు మనం ఫేక్ న్యూస్, మీడియా పక్షపాతం గురించి మాట్లాడుకుంటున్నాం. కానీ ఆనాడే కార్ల్ మార్క్స్ దీన్ని ప్రశ్నించారు అని వాలేరియా చెప్పారు.

"ఆనాడు ప్రచురితమైన కథనాలను చదివి మార్క్స్ ఒక అవగాహనకు వచ్చేవారు. చిన్న చిన్న నేరాలు, పేద ప్రజల్లో నేర ప్రవృత్తి వంటి అంశాలు పత్రికల్లో ఎక్కువగా కనిపించేవి. కానీ వైట్ కాలర్ నేరాలు, రాజకీయ కుంభకోణాలను మీడియా తొక్కిపట్టి ఉంచేదని ఆయన ఆనాడే అర్థం చేసుకున్నారు" అని వాలేరియా అన్నారు.

సమాజాన్ని విభజించేందుకు మీడియా కూడా ఒక చక్కని సాధనం. "ఆంగ్లేయుల నుంచి ఐర్లాండ్ పౌరులు ఉద్యోగాలు కొల్లగొడు తున్నారని, తెల్ల జాతీయులు నల్ల జాతీయులను అవమానిస్తున్నారని, వలసవాదులు స్థానికుల మధ్య గొడవలు.. ఇలా జగడాలు పెట్టేందుకు మీడియాను ఉపయోగించుకునే ప్రమాదం ఉంది. పేద ప్రజలు తమలో తాము కొట్లాడుకుంటుంటే శక్తిమంతమైన సంపన్నుల జోలికి ఎవరూ రారు" అని వాలేరియా వివరించారు.

నిజానికి మార్క్సిజం ఆధునిక పెట్టుబడిదారీ విధానం కంటే ముందే వచ్చింది. కానీ ప్రస్తుతమిది నిర్ధరించుకోవాల్సిన విషయం. పెట్టుబడిదారీ విధానం గురించి బాగా తెలియడానికి ముందే ప్రపంచం మార్క్సిజం గురించి చదువుకొని ఉంది.

ఆర్థికశాస్త్ర పితామహుడిగా పేరున్న ఆడమ్ స్మిత్ క్యాపిటలిజం పదాన్ని 'ఇన్విజిబుల్ హ్యాండ్' పుస్తకంలో మొదటిసారి వాడలేదని రచయిత లిండా యూహ్ చెప్పారు.

ఆడమ్ స్మిత్ కంటే ముందే 1854లో 'వానిటీ ఫెయిర్' అనే పుస్తకంలో రచయిత విలియం మేక్పీస్ థాకరే క్యాపిటలిజం పదాన్ని ఉపయోగించారని యూహ్ అన్నారు.

ఆ పుస్తకంలో క్యాపిటలిస్ట్ పదాన్ని 'సంపదకు యజమాని' అనే అర్థం వచ్చేలా ఉపయోగించారని యూహ్ వివరించారు. కానీ ఆర్థిక పరిభాషలో ఈ పదాన్ని తొలిసారి ఉపయోగించింది మాత్రం కార్ల్ మార్క్సే. ఆయన 1867లో రాసిన క్యాపిటల్ (దాస్ క్యాపిటల్) పుస్తకంలో దీని ప్రస్తావన ఉంది.

ఆ తర్వాత మార్క్సిజానికి ఈ పదం పర్యాయపదంగా మారిపోయింది. అంటే ఒక రకంగా పెట్టుబడిదారీ విధానం కంటే ముందే మార్క్సిజం వచ్చింది.

**– బి బి సి తెలుగు న్యూస్ సౌజన్యంతో...** ❑

---

## మన తరం తుగ్లక్ కథలు మనమే రాసుకోవాలి

**(16వ పేజీ తరువాయి)**

చో సినిమాగా తీసిన తుగ్లక్ కథలో ఓ గాంధీవాది, అతని కూతురు కనిపిస్తారు. ఆమె చిలక జోస్యం చెప్పుకుని బతుకుతున్నట్లు రాశారు చో. మన రాజకీయాల్లో నీతిగానూ, నిజాయితీగానూ బతికినవాళ్ల సంతానం స్థితి గతులు ఇవాళ అందుకు భిన్నంగా ఉన్నాయా?

ఏతావాతా నేను చెప్పేదేమిటంటే మన కాలపు తుగ్లక్ గురించి మనమే రాసుకోవాలి. కార్నాడ్, చో రామసామి లాంటి వాళ్ళ నుంచి మనం నేర్చుకోవాల్సిన విషయాలు అన్నింట్లోకీ ఇదే ముఖ్యమైంది! ఏ తరం అవసరాలను ఆ తరానికి చెందిన రచయితలూ కళాకారులే తీర్చుకోవాలి.


### రచయితలూ, వింటున్నారా?

గాంధీ గారి బొమ్మని – బొమ్మ తుపాకులతోనే అయినప్పటికీ – కాల్చి, "గోడ్సే అమర్ హై" అంటూ నినాదాలిచ్చే దేశభక్తులు మనల్ని కమ్ముకుని ఉన్న కాలమిది.

భోపాల్ నుంచి బీజేపీ తరఫున ఎంపీగా గెల్చిన మాలేగాం మారణ కాండ నిందితురాలు ప్రజ్ఞా సింగ్ ఠాకూర్ గోడ్సేని అమరవీరుడిగా అభివర్ణించిన పిదప కాలమిది. ఇలాంటి దశలో మన పని మనం చెయ్యకపోతే రేపు చరిత్ర ముందు చేతులు కట్టుకుని నిలబడవలసి వస్తుంది! ❑

RNI Regn No. 52879/93

*With best compliments from*




పశ్చిమగోదావరి జిల్లాలో మొట్టమొదటిసారిగా ఆటోమేటిక్ మెషీన్ ద్వారా
పరిశుభ్రమైన వాతావరణంలో తయారుచేసి రుచికరంగా అందిస్తున్నాం

**పార్టీలకు, ఫంక్షన్లకు ఆర్డరుపై సప్లయి చేయబడును**

# సాయి ఫుడ్స్

డోర్ నెం. 23బి-9-6/1, యస్.ఆర్.పి. టవర్స్, ఆర్.ఆర్.పేట
ఏలూరు - 534 002    సెల్ : 82972 40270

**JAATEEYA SPURTHI,** Fortnightly Printed and **Published by N. Venkateswara Rao**
at Godavari Printers, R.R.Pet, ELURU - 534 002. ✆ 9848 234228 **Chief Editor : D V V S Varma**